


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 08 జూలై 2021 సంపుటి : 02 సంచిక :346 పేజీలు : 4 వెల : రూ 3-00


# మోదీ కొత్త మంత్రివర్గం

## ఎన్నికలు, అన్ని వర్గాలకు ప్రాధాన్యంపై దృష్టి



న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మంత్రివర్గాన్ని అనేక వైవిద్యాలతో పునర్వ్యవస్థీకరించబోతున్నారు. వచ్చే ఏడాది జరిగే శాసన సభల ఎన్నికలు, 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నూతన ఆలోచనలతో దేశాభివృద్ధికి పాటుపడేవారికి స్థానం కల్పించబోతున్నారు. ఉన్నత విద్యావంతులు, యువత, మహిళలు, సమాజంలో అణగారిన వర్గాలు, వివిధ మతాలు, ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు... ఇలా అన్ని రకాలుగా అందరికీ ప్రాధాన్యమిస్తూ, సమతూకం పాటించడానికి గట్టిగా కృషి చేస్తున్నారు. రాష్ట్రాలు, ప్రాంతాలవారీగా అందరికీ సమన్యాయం జరిగేవిధంగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్ శాసన సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆ రాష్ట్రానికి పెద్ద పీట వేయబోతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సహాయ మంత్రులుగా ఉన్న ఏడుగురికి పదోన్నతి లభించే అవకాశం ఉందని జాతీయ మీడియా చెప్తోంది. తెలుగు తేజం జి కిషన్ రెడ్డి కూడా ఈ జాబితాలో ఉన్నారని చెప్తున్నారు. ఎన్డీయే కూటమిలోని అప్నాదళ్ (ఎస్) నేత అనుప్రియ పటేల్‌కు మంత్రి పదవి లభించబోతున్నట్లు తెలుస్తోంది. సహాయ మంత్రులు దేబశ్రీ చౌదరి, రావ్ సాహెబ్ పాటిల్, సంజయ్ ధోత్రే, సంతోష్ గంగ్వార్ రాజీనామా చేశారు. కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన జ్యోతిరాదిత్య సింధియాకు మంత్రి పదవి ఖాయమని తెలుస్తోంది. కొత్త మంత్రివర్గంలో 13 మంది న్యాయవాదులు, 6గురు వైద్యులు, 5 గురు ఇంజనీర్లు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. పీహెచ్‌డీ, ఎంబీఏ వంటి ఉన్నత విద్యావంతులకు మోదీ ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. ముగ్గురు ఎస్టీలు, ఇద్దరు ఎస్సీలకు కేబినెట్ హోదా ఇవ్వబోతున్నట్లు సమాచారం. సహాయ మంత్రులు కిరణ్ రిజిజు, అనురాగ్ ఠాకూర్‌లకు పదోన్నతి లభిస్తుందని చెప్తున్నారు.

**కొత్త మంత్రుల జాబితా విడుదల...**

1. నారాయణ రాణే 2. సర్బానంద్ సోనోవాలా 3. డాక్టర్ వీరేంద్ర కుమార్ 4. జ్యోతిరాదిత్య సింధియా 5. రామచంద్ర ప్రసాద్ సింగ్ 6. అశ్వనీ వైష్ణవ్ 7. పశుపతి కుమార్ పారస్ 8. కిరణ్ రిజిజు 9. రాజ్ కుమార్ సింగ్ 10. హర్దీప్ సింగ్ పూరీ 11. మన్సుఖ్ మాండవ్య 12. భూపేందర్ యాదవ్ 13. పురుషోత్తం రూపాలా 14. కిషన్ రెడ్డి 15. అనురాగ్ ఠాకూర్ 16. పంకజ్ చౌధురి 17. అనుప్రియా పటేల్ 18. సత్యపాల్ సింగ్ బాఘేల్ 19. రాజీవ్ చంద్రశేఖర్ 20. శోభా కరంద్లాజే 21. భానుప్రతాప్ సింగ్ వర్మ 22. దర్శన విక్రమ్ జర్దోశ్ 23. మీనాక్షి లేఖీ 24. అన్నపూర్ణా దేవి 25. నారాయణ స్వామి 26. కౌశల్ కిశోర్ 27. అజయ్ భట్ 28. బి.ఎల్. వర్మ 29. అజయ్ కుమార్ 30. చౌహాన్ దేవూసింగ్ 31. భగవంత్ ఖూబా 32. కపిల్ మోరేశ్వర్ పాటిల్ 33. ప్రతిమా భౌమిక్ 34. భగవత్ కృష్ణారావు 35. సుభాశ్ సర్కార్ 36. రాజ్‌కుమార్ రాజన్ సింగ్ 37. భారతీ పవార్ 38. విశ్వేశ్వర్ తుడు 39. శంతనూ ఠాకూర్ 40. మహేంద్ర భాయ్ 41. జాన్ బర్లా 42. మురుగన్ 43. నితీశ్ ప్రామాణిక్

### ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు 15 నుంచి

# పాఠశాలల ప్రారంభం

## నాడు-నేడు, జగనన్న విద్యా కానుకపై సీఎం జగన్ సమీక్ష

తాడేపల్లి: ఆగస్టులోపు విద్యాసంస్థల్లో నాడు-నేడు పెండింగ్ పనులు పూర్తి కావాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈనెల 15 నుంచి ఆగస్టు 15వరకు వర్క్‌బుక్స్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. నాడు-నేడు కింద పనుల కోసం రూ.16 వేల కోట్లతో బడ్జెట్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. నాడు నేడు, జగనన్న విద్యా కానుకపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. ఈ సమావేశానికి విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం

నూతన విద్యా విధానం అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, విద్యావంతులైన నైపుణ్యం గల



టీచర్లతో బోధన అందించాలని తెలపారు. మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా టీచర్లు ఉండాలన్నారు. ఈ లక్ష్యాల కోసమే నూతన విద్యా విధానం అమలు చేస్తున్నామన్నారు. ఒక్క స్కూల్ కూడా మూసివేయకూడదని, ఒక్క టీచర్‌ను కూడా తొలగించకూడదని ఆదేశించారు. నూతన విద్యా విధానం ప్రతిపాదనలను ఈ వారంలో ఖరారు చేయాలన్నారు. నాడు-నేడు పనులను యథావిధిగా కొనసాగించాలని, షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తికావాలని అధికారులను ఆదేశించారు.

టీచర్లకు వ్యాక్సినేషన్

ఆగష్టు 15 తర్వాత పాఠశాలలు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆగష్టు 15 లోపు టీచర్లకు వ్యాక్సినేషన్ వేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆగష్టులోనే విద్యా కానుక, నాడు-నేడు రెండో విడత పనులు ప్రారంభం కావాలన్నారు. తొలివిడత పనులు పూర్తైన పాఠశాలలను ప్రజలకు అంకితం చేయనున్నట్లు తెలిపారు.

# పిసిసి చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన రేవంత్

- అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో వేదాశీర్వచనం
- గాంధీభవన్‌లో హాజరైన కాంగ్రెస్ అగ్రనేతలు
- అంతకుముందు ర్యాలీ..పెద్దమ్మ గుడిలో పూజలు



హైదరాబాద్,జూలై7 : గాంధీభవన్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో వేదంపడితుల ఆశీర్వచనాల మధ్య రేవంత్ రెడ్డి తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. పండితులు మంత్రాలు పఠిస్తూ ముందుగా రేవంత్‌ను దీవించారు. అనంతరం పూలమాలలను ధరింప చేశారు. అనంతరం ఆయన ఉత్తమ్ కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అతిరథులంతా పాల్గొన్నారు. సిఎల్పీ నేత భట్టి విక్రమార్క, గీతారెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, మల్లు రవి, శ్రీధర్ బాబు, జగ్గారెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన తన ఇంట్లోనుంచి బయలుదేరేముందు వేదాశీర్వచనం తీసుకున్నారు. భారీగా తరలి వచ్చిన అభిమానుల మధ్య టాప్‌లేని జీపులో ఉదయం ఆయన జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లిని దర్శించుకునేందుకు బయలుదేరారు. గుడి వద్దకు చేరుకోగానే కార్యకర్తలు, అభిమానులు గజమాలతో రేవంత్‌ను సత్కరించారు. అనంతరం పెద్దమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వచనం అందించారు. తర్వాత గాంధీభవన్‌కు రేవంత్ ర్యాలీగా బయల్దేరారు. గాంధీభవన్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు టీపీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నుంచి రేవంత్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో భారీ ర్యాలీ ఆకట్టుకుంది. రేవంత్ జిందాబాద్ నినాదాలు మిన్నంటాయి.

# నూతన విద్యా విధానంతో ఏ స్కూల్ మూతపడదు: మంత్రి సురేష్

అమరావతి: ఆ ఆంధ్రప్రదేశ్‌లో ఆగష్టు 16 నుంచి పాఠశాలలు పునఃప్రారంభించాలని నిర్ణయించినట్లు విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. ఈనెల 12 నుంచి ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. నాడు నేడు, జగనన్న విద్యా కానుకపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ.. రెండేళ్లలో ఫౌండేషన్ స్కూళ్లకు అదనపు గదులు నిర్మిస్తామని తెలిపారు. 30 శాతం పదో తరగతి, 70 శాతం ఇంటర్ ఫస్టియర్ మార్కులు ప్రాతిపదికగా.. ఇంటర్ విద్యార్థులకు మార్కుల కేటాయిస్తామని అన్నారు. ఈ నెలాఖరులోపు ఇంటర్ విద్యార్థులకు మార్కుల మెమోలు జారీ చేస్తామన్నారు. అయితే నాడు-నేడు కింద పనుల కోసం రూ.16 వేల కోట్లతో బడ్జెట్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఆగష్టులోపు విద్యాసంస్థల్లో నాడు-నేడు పెండింగ్ పనులు పూర్తి కావాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నాడు-నేడు కింద పనుల కోసం రూ.16 వేల కోట్లతో బడ్జెట్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు.



# కేబీఆర్ పార్క్ ను సందర్శించిన సీఎస్

హైదరాబాద్: నగరంలోని కాసు బ్రహ్మానంద రెడ్డి జాతీయ ఉద్యానవనంను(కెబిఆర్) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్ బుధవారం సందర్శించారు. హరిత హారం కార్యక్రమంలో భాగంగా ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పార్కులోని నడక దారి (వాకింగ్ ట్రాక్) ని పరిశీలించారు. పార్కుకు వచ్చే సందర్శకుల కోసం చేపట్టిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు.అటవీ పునరుజ్జీవన కార్యక్రమంలో భాగంగా పార్కులో చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు సి.యస్ కు వివరించారు. డ్రోన్ ల ద్వారా ప్రయోగాత్మకంగా చేపడుతున్న సీడ్ బాల్స్ వదిలే కార్యక్రమంపై ఆసక్తి కనబరచారు.పిసిసిఎఫ్ శోభ, పిసిసిఎఫ్ ఎస్. శ్రీనివాస్, అదనపు పిసిసిఎఫ్ లు సిద్ధానంద్ కుక్రేటి, ఎంసి పర్ గెయిన్, వినయ్ కుమార్, హైదరబాద్ ఫారెస్ట్ కన్జర్వేటర్ అక్బర్, రంగారెడ్డి ఫారెస్ట్ కన్జర్వేటర్ సునితా భగవత్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అటవీ శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### దేశంలో మరోమారు పెరిగిన

# కరోనా కేసులు

- కేసులతో పాటు మరణాల సంఖ్యలోనూ పెరుగుదల
- కొత్తగా 43,733 పాజిటివ్ కేసులు నమోద
- వైరస్ ప్రభావంతో మరో 930 మంది మృత్యువాత

న్యూఢిల్లీ,జూలై7(: దేశంలో కరోనా రోజువారీ కేసులతో పాటు మరణాలు మళ్లీ పెరిగడం ఆందోళన కలిగిస్తోంది. ఇ÷-పటి వరకు 40వేలకు దిగువన నమోదైవుతూ వస్తున్న కేసులు బుదవారం మళ్లీ పెరిగాయి. గడిచిన 24గంటల్లో 43,733 పాజిటివ్ కేసులు నమోదయ్యాయని కేంద్ర కుటుంబ, ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. కొత్తగా 47,240 మంది బాధితులు కోలుకున్నారు. వైరస్ ప్రభావంతో మరో 930 మంది మృత్యువాతపడ్డారు. తాజాగా నమోదైన కేసులతో దేశంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 3,06,63,665కు పెరిగింది. మొత్తం 2,97,99,534 మంది బాధితులు కోలుకున్నారు. మహమ్మారి ప్రభావంతో 4,04,211 మంది మృతి చెందారు. ప్రస్తుతం దేశంలో 4,59,920 యాక్టివ్ కేసులున్నాయని తెలిపింది. ప్రస్తుతం జాతీయ రికవరీ రేటు 97.18శాతానికి పెరిగిందని, వీక్లీ పాజిటివిటీ రేటు 2.39 శాతంగా ఉందని తెలిపింది. రోజువారీ పాజిటివిటీ రేటు 2.29శాతానికి తగ్గిందని ఆరోగ్యశాఖ పేర్కొంది. టీకాల పంపిణీ కార్యక్రమంగా సాగుతున్నదని తెలిపింది. మొత్తం 36.13 కోట్ల డోసులు టీకా డ్రైవ్‌లో పంపిణీ చేసినట్లు వివరించింది.

# కేంద్ర మంత్రి హర్షవర్ధన్ రాజీనామా



న్యూఢిల్లీ : మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ రాజీనామా చేశారు. మొత్తం మీద ఏడుగురు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. సదానంద గౌడ, దేబశ్రీ చౌదరి, రావ్ సాహెబ్ పాటిల్, సంజయ్ ధోత్రే, సంతోష్ గంగ్వార్, రమేశ్ పోఖ్రియాల్ నిశాంక్ రాజీనామా చేసినవారిలో ఉన్నారు. అన్ని వర్గాలకు సమతూకం పాటిస్తూ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నట్లు బీజేపీ వర్గాలు చెప్తున్నాయి. కొత్త మంత్రివర్గంలో 13 మంది న్యాయవాదులు, 6గురు వైద్యులు, 5 గురు ఇంజనీర్లు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. పీహెచ్‌డీ, ఎంబీఏ వంటి ఉన్నత విద్యావంతులకు మోదీ ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. ముగ్గురు ఎస్టీలు, ఇద్దరు ఎస్సీలకు కేబినెట్ హోదా ఇవ్వబోతున్నట్లు సమాచారం. సహాయ మంత్రులు కిరణ్ రిజిజు, అనురాగ్ ఠాకూర్‌లకు పదోన్నతి లభిస్తుందని చెప్తున్నారు. ప్రస్తుతం సహాయ మంత్రులుగా ఉన్న ఏడుగురికి పదోన్నతి లభించే అవకాశం ఉందని జాతీయ మీడియా చెప్తోంది. తెలుగు తేజం జి కిషన్ రెడ్డి కూడా ఈ జాబితాలో ఉన్నారని చెప్తున్నారు. ఎన్డీయే కూటమిలోని అప్నాదళ్ (ఎస్) నేత అనుప్రియ పటేల్‌కు మంత్రి పదవి లభించబోతున్నట్లు తెలుస్తోంది.

# ప్రధాని మోదీకి సీఎం వైఎస్ జగన్ లేఖ

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ వైఖరిపై మరోసారి ఫిర్యాదు చేశారు. తక్షణమే కేంద్రం జోక్యం చేసుకోవాలని లేఖలో కోరారు. ఆ లేఖలో.. " తెలంగాణ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా ఆపరేషన్ ప్రొటోకాల్ ఉల్లంఘిస్తోంది. కేఆర్ఎంబీ పరిధిని తక్షణమే నోటిఫై చేసేలా... జలశక్తి శాఖకు ఆదేశాలు ఇవ్వాలి. శ్రీశైలంలో నీటిమట్టం పెరగకుండా తెలంగాణ అక్రమంగా నీటిని తోడేస్తోంది. దీని వల్ల పోతిరెడ్డిపాడుకు సాగునీరు రాకుండా తెలంగాణ అడ్డుకుంటోంది.కేఆర్ఎంబీకి ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే.. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతలలో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి చేస్తోంది. దీంతో కృష్ణా డెల్టా, రాయలసీమ ప్రాంతానికి ఇబ్బంది కలుగుతుంది. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షించేలా.. సీఐఎస్ఎఫ్ బలగాల పరిధిలోకి ప్రాజెక్టలను తేవాలి. తక్షణమే తెలంగాణ ప్రభుత్వాన్ని కట్టడి చేసేలా... కేంద్ర జలశక్తి శాఖకు ఆదేశాలు ఇవ్వాలి" అని పేర్కొన్నారు.



# సంపాదకీయం

గురువారం 08 జూలై 2021

## నిప్పుల కుంపటిలా మారుతున్న నీటి వివాదం

తెలుగు రాష్ట్రాల రాజకీయం రగిలిస్తున్న జలజగడం ఆరని కుంపటిగా మారుతోంది. హుజూరాబాద్ ఎన్నికను దృష్టిలో పెట్టుకుని అధికార తెలంగాణ రాష్ట్రసమితి ఈ వివాదాన్ని వెలికి తెచ్చిందని ప్రతిపక్ష పార్టీలు తొలి దశలో ఆరోపించాయి. తాము వెనకబడకూడదన్న యావలో విపక్షాలు సరికొత్త డిమాండ్లను పెడుతున్నాయి. అగ్నిగుండం మరింత ప్రజ్వరిల్లేందుకు తమ వంతు ఆజ్యం పోస్తున్నాయి. అటు ఆంధ్రప్రదేశ్ సైతం క్రమేపీ స్వరం పెంచడం మొదలు పెట్టింది. ప్రధానమంత్రిని, జలవనరుల శాఖ మంత్రిని, న్యాయస్తానాలను ఆశ్రయిస్తూ ఉపశమనం పొందాలని చూస్తోంది. అయితే రాజకీయ పోరాటానికి మాత్రం ఇంకా ఏపీ సిద్ధం కాలేదు. తెలంగాణ ముఖ్యమంత్రికి, ఇక్కడ ఉన్న రాజకీయ పార్టీలకు ఉన్న వెసులుబాటు ఏపీలోని అధికార, విపక్ష అగ్రనేతలకు లేదు. దాంతో ఇంకా వీధి పోరాటాలు, సవాళ్ల స్థాయికి ఉద్రిక్తత చేరలేదు. అయితే ఇదే ధోరణి దీర్ఘకాలం ఉంటుందని చెప్పలేం. అక్కడి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతోంది. ఫలితంగా ఎప్పుడో ఒకప్పుడు బరస్ట్ కాకతప్పని పరిస్థితి ఏర్పడుతోంది. నీటితో వివాదాలు నిప్పు కంటే ప్రమాదకరమైనవి. అందువల్ల కృష్ణా జలాల పంపిణీ శాశ్వత సమస్యగా పరిణమించే ప్రమాదం కానవస్తోంది. ఆంధ్రప్రదేశ్ అగ్రనాయకులకు ఆర్థిక బలహీనత వెన్నాడుతోంది. అటు చంద్రబాబు నాయుడి ఆర్థిక మూలమైన హెరిటేజ్ ప్రధాన కార్యాలయాలు, ఆయన నివాసం సహా హైదరాబాదులోనే ఉన్నాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కుటుంబ వ్యాపార కార్యకలాపాల ప్రధాన కేంద్రమూ హైదరాబాదే. అంతేకాకుండా ఆంధ్రప్రదేశ్ లో రాజకీయ ప్రముఖులు చాలామందికి వ్యాపారాలు, పరిశ్రమలు భాగ్యనగరంతోనే ముడిపడి ఉన్నాయి. పరిపాలన కేంద్రం అమరావతికి తరలి వెళ్లిందే మినహా ప్రయివేటు వ్యాపార , వ్యవహారాలు ఇక్కడి నుంచి ఎవరూ తరలించలేదు. దాంతో ఏరికోరి తెలంగాణ ప్రభుత్వంతో గొడవ పెట్టుకోవడానికి నాయకులెవరూ సిద్ధం గా లేరు. మన ప్రజలు అక్కడ ఉన్నారనే సాకును చూపుతున్నారు. ఓటర్లుగా తెలంగాణలో ఉన్న సీమాంధ్ర మూలాలు ఉన్న ప్రజల బాగోగులు చూసుకోవాల్సింది ఇక్కడి ప్రభుత్వమే. అంతే తప్ప ఏపీ ప్రభుత్వానికి సంబంధం ఉండదు. వాళ్లు ఇక్కడి ఓటర్లు. ఏ రాజకీయ పార్టీ అయినా తమ ఓటర్లను కాదనుకునే అవకాశమే లేదు. అందువల్ల తమ రాష్ట్ర ప్రయోజనాలు న్యాయబద్ధమైనంతవరకూ తామే చూసుకోవాలి. అంతేకానీ తెలంగాణలో మన ప్రజలు అనే ముసుగు వేయడం అర్ధ రహితం. సన్నాయి నొక్కులే తప్ప సత్యం మాత్రం కాదు. ఇటీవల హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికలో సీమాంధ్రులు నివసించే ప్రాంతాల్లోనే టీఆర్ఎస్ ఆధిక్యం సాధించింది. ఇవన్నీ పరిగణనలోకి తీసుకుంటే అక్కడి నాయకుల వాదనల్లోని డొల్లతనం తేటతెల్లమవుతుంది. మరో వైపు తెలంగాణలో కేసీఆర్ సెగ రాజేసిన నిప్పు మళ్లీ తనకే అంటుకునే ప్రమాదం కనిపిస్తోంది. బీజేపీ, కాంగ్రెసు నాయకులు కొత్త డిమాండ్లు తెస్తూ టీఆర్ఎస్ పై ఆధిక్యానికి ప్రయత్నిస్తున్నారు. అధికార పార్టీ వెనక్కి వెళ్లలేని పరిస్థితి కల్పిస్తున్నారు. మూడింట రెండు వంతుల కృష్ణానదీ పరివాహక ప్రాంతం తెలంగాణలో ఉంది. అందువల్ల అసలు 811 టీఎంసీల్లో అయిదు వందల టీఎంసీలు ఈ రాష్ట్రానికే చెందాలని బీజేపీ పట్టుబడుతోంది. సగం, సగం నిష్పత్తిలో పంచుకోవాలన్న కేసీఆర్ వాదనకు ఇది మరో కోణం. 2015లో కేంద్ర జలవనరుల శాఖ ఆధ్వర్యంలోనే ఇరు రాష్ట్రాల మంత్రులు నీటి పంపకాలపై ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఇప్పుడు మళ్లీ కేంద్రమే నాయకత్వం వహించాలి. కానీ తాజా పరిస్థితుల్లో శాంతంగా చర్చించేందుకు తెలంగాణ అంగీకరించే వాతావరణమే లేదు. కాంగ్రెసు నేత రేవంత్ రెడ్డి మరో విచిత్రమైన డిమాండ్ ముందుకు తెచ్చారు. కేసీఆర్, కేటీఆర్ లు ఢిల్లీలో ఆమరణ దీక్ష చేయాలని, తాము మద్దతు ఇస్తామంటూ ప్రతిపాదించారు. ఆచరణ సాధ్యం కాని ఈ వింత వాదనతో టీఆర్ఎస్ ను, బీజేపీని ఇరుకున పెట్టాలనేది ఆయన ఆంతర్యం. ఒకవేళ రేవంత్ చొరవ తీసుకుని తెలంగాణ హక్కులు అనే పేరిట ఢిల్లీలో గలాటా చేస్తే టీఆర్ఎస్ ఇరకాటంలో పడుతుంది. ముందు నుయ్యి వెనక గొయ్యిగా మారుతుంది. రేవంత్ ను సమర్థించలేదు. అలాగని మౌనం వహిస్తే ప్రజల్లో అధికార పార్టీ పలచన అవుతుంది. ఇరు రాష్ట్రాలు రాజకీయం చేస్తున్నాయి. పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయి. వాస్తవాలేమిటో తేల్చే అస్త్రాలు కేంద్రం వద్ద ఎన్నో ఉన్నాయి. ఆరోపణలు వచ్చిన ప్రాజెక్టులు, అంశాలన్నిటిపైనా కృష్టా రివర్ బోర్డు పరిశీలన చేసి ప్రత్యక్ష సందర్శనంతో నిగ్గు తేలిస్తే సరిపోతుంది. అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణ తమ రాష్ట్రాల్లో బోర్డు పర్యటించడానికి సుముఖంగా లేవు. అంటే ఏదో పితలాటకం ఉంది. పోతిరెడ్డి పాడు విస్తరణ లేదు. కేవలం ప్రవాహ వేగాన్ని మాత్రమే పెంచుతున్నామంటోంది ఏపీ ప్రభుత్వం. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు తనిఖీలకు అంగీకరించాలని పట్టుబడుతోంది తెలంగాణ ప్రభుత్వం. గుప్పెట మూసి ఉంచి రాజకీయ వివాదాలతో కాల క్షేపం చేయడం కంటే మొత్తంగా ఆరోపణలున్న ప్రాజెక్టులన్నిటినీ విచారణ పరిధిలోకి తేవడం ఉత్తమం. తాత్కాలిక ప్రయోజనాల కోసం రెండు రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాజకీయ పార్టీలు, ప్రతిపక్షాలు రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టుకుంటున్నాయి. దీనికి శాశ్వత పరిష్కారాన్ని కేంద్రమే చూపాలి. అయితే బీజేపీ పెద్దలు సైతం ఈ గొడవలో తమకు కలిసి వచ్చే అంశాలేమిటనే లెక్కల్లో మునిగి తేలుతున్నారు. అందుకే ఈ వివాదానికి ఫుల్ స్టాప్ సంగతి దేవుడెరుగు, కనీసం కామాలు కూడా ఉండకపోవచ్చుననిపిస్తోంది.

# తరలింపుపై మీనమేషాలు

విశాఖపట్టణం, జూలై 7, (న్యూస్ పల్స్)పాలనా రాజధానిని విశాఖకు తరలించే ఆలోచనపై సర్కారే సందిగ్ధంలో ఉన్నట్లు కనిపిస్తోంది. ఏడాదిగా నలుగుతున్న తరలింపు వ్యవహారం ఇప్పట్లో కొలిక్కి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఉన్నతస్థాయి అధికారులు అంటున్నారు. ముందుగా ముఖ్యమంత్రి విశాఖకు వెళ్లిపోతారని, తరువాత దశలవారీగా శాఖాధిపతులు, ఆ తరువాత సచివాలయం వెళ్తుందని మంత్రులు, సలహాదారులు చెబుతున్నప్పటికీ ఇప్పట్లో ఆ విషయం ముందుకు సాగే అవకాశాలు కనిపించడం లేదని సమాచారం. ప్రధానంగా విశాఖలో రాజధాని ఏర్పాటు చేయాలంటే సచివాలయానికు పాతిక నుంచి 30 ఎకరాల విస్తీర్ణంలో ఉండే భవన సముదాయం అవసరమని అధికారులు అంటున్నారు. వందకు పైగా ఉన్న శాఖాధిపతుల కార్యాలయాలకు కూడా భవనాలను సమకూర్చాల్సి ఉంటుంది. ఇంత భారీ స్థాయిలో భవనాలు సమకూర్చాలంటే అంత సులువుగా జరిగే పనికాదని సాధారణ పరిపాలనశాఖ అభిప్రాయపడుతున్నట్లు తెలిసింది. ఇప్పట్లో సొంత భవనాలు సమకూర్చుకోవడం సాధ్యం కాని నేపథ్యంలో అద్దెకు భవనాలను సమకూర్చుకోవాల్సి ఉంటుందని వారు చెబుతున్నారు. అయితే, ఇది భారీ వ్యయంతో కూడుకున్నదని చెబుతున్నారు. ఆర్థికశాఖ కూడా ఇదే భావాన్ని వ్యక్తం చేస్తోంది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో సొంత భవనాల నిర్మాణం కూడా అసాధ్యమని వారు అంటున్నారు. విజయవాడ, గుంటూరులో తీసుకున్న మాదిరిగా విశాఖలో అద్దెకు భవనాలు తీసుకునే ఆలోచన చేసినప్పటికీ, ప్రస్తుత రాజధానిలో ఉన్న భవనాలను పూర్తిగా ఖాళీ చేస్తేనే ఆ అద్దె సొమ్మును విశాఖలో ఖర్చు చేసే అవకాశాలు ఉంటాయని, అయితే విజయవాడ, గుంటూరుల్లో అద్దె భవనాలను ఆయా శాఖల అధికారులు వెంటనే ఖాళీ చేస్తారా అన్నది ప్రశ్నగానే కనిపిస్తోందని ఆర్థికశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నుంచి అమరావతికి వచ్చి ఐదేళ్లు దాటిపోయినప్పటికీ ఇంకా కొన్ని భవనాలకు హైదరాబాద్‌లో అద్దె చెల్లించాల్సి వస్తోందని, అఖిలభారత సర్వీసు అధికారులు కూడా హైదరాబాద్, అమరావతిల్లో రెండేసి గృహాలు ఉంచుకోవడం వల్ల రెండు అద్దెలు చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు.కోర్టు కేసులు, కరోనా వ్యాప్తి కూడా తరలింపునకు పెద్ద అడ్డంకిగానే కొందరు అధికారులు విశ్లేషిస్తున్నారు. అమరావతి రైతులు వేసిన అనేక కేసులు ఉన్నత న్యాయస్థానాల్లో విచారణలోనే ఉన్నాయి. ఇవి పరిష్కారం కాకుండా తరలింపు సాధ్యం కాదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. రైతులు, ప్రభుత్వం తరపున న్యాయవాదులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇక గత ఏడాది మార్చి నుంచి రాష్ట్రాన్ని కుదిపేస్తున్న కరోనా కూడా తరలింపునకు అడ్డుగానే భావిస్తున్నారు. ఈ సమయంలో వేల మందిని తరలించడం వైద్యపరంగా మంచిది కాదన్న అభిప్రాయాన్ని వైద్య శాఖ కూడా వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే అన్నీ సద్దుమణిగితే తరలింపు పూర్తి చేసేందుకు మరో ఏడాది పడుతుందని సీనియర్ అధికారులు కొందరు అంటున్నారు.

# హైద్రాబాద్ నుంచి రాని చంద్రబాబు



విజయవాడ, జూలై 7,(న్యూస్ పల్స్)ఒకనాడు ఇదే చంద్రబాబు లోకేష్ బాబు ఒక మాట తరచూ అనేవారు. ఎక్కడో తెలంగాణాలో కూర్చుని ఏపీ మీద విమర్శలు చేసే వారిని ఎన్నారైలుగా చిత్రీకరించేవారు. అవును మరి ఆ రోజుల్లో తెలుగుదేశం జోరు సాగుతోంది. రాజకీయ ప్రభ వెలుగుతోంది. అందుకే ఆ మాటలు తూటాలుగా దూసుకొచ్చాయి. ఇపుడు సీన్ మొత్తం మారిపోయింది. విపక్ష పాత్రలోకి టీడీపీని జనం నెట్టేశారు. దాంతో చంద్రబాబు తన మకాం వందల కోట్లతో నిర్మించిన అతి విలాసవంతమైన హైదరాబాద్ లోకి మార్చేశారు. ఆయన కలల రాజధాని అమరావతికి దగ్గరలో అయినా కాపురం ఉండడానికి ఎందుకో ఇష్టపడలేదు. అందుకే వైసీపీ రివర్స్ లో అటాక్ చేస్తోంది. చంద్రబాబుకు ఏపీతో ఏం పని అంటూ వారి పాఠాలను తిరిగి అప్పచెబుతోంది.చంద్రబాబు మాజీ ముఖ్యమంత్రి అయ్యాక రెండేళ్ళుగా హైదరాబాద్ కే పరిమితం అయ్యారు. ఆయన అక్కడ నుంచే జూమ్ యాప్ ద్వారా కథ నడిపిస్తున్నారు. ఈ లోగా ఎన్నో పరిణామాలు జరిగిపోతున్నాయి. ఢిల్లీలో జాతీయ రాజకీయాల్లో కీలకమైన మార్పులు వస్తున్నాయి. శరద్ పవార్ లాంటి నాయకులు మూడవ ఫ్రంట్ పేరిట వంటకం మొదలుపెట్టారు. అసలు ఇలాంటి రాజకీయ వంటకాలను వండడంతో నలభీములను తలపించే చంద్రబాబు మాత్రం ఢిల్లీ వైపు చూడడం లేదు. కనీసం ఆయన ఊసు కూడా లేకుండా కూటములు కట్టేస్తున్నారు. అంటే ఢిల్లీ ఫ్లైట్ బాబు ఎక్కాల్సిన అవసరం లేదా. లేక ఆయనకే ఆసక్తి లేదా అన్నది ఒక ప్రశ్న.కరోనా కష్టం వచ్చిందని విపక్ష నేత సొంత రాష్ట్రానికి దూరంగా ఉంటే ఎలా. ఇది వైసీపీ విమర్శించిందని కాదు కానీ జనాల్లో కూడా ఉన్న సందేహమే ఇది. పైగా సొంత పార్టీ వారికీ ఇలాంటి డౌట్లే వస్తున్నాయట. రెండేళ్ళ జగన్ పాలన ముగిసింది. ఇక ఎక్కడికక్కడ నట్లు బిగించాలి అంటే విపక్ష నేత జనాల్లో ఉండాలి. ఎక్కడో దూరంగా కూర్చుని జూమ్ యాప్ ద్వారా విమర్శలు చేస్తూ అనుకూల మీడియాలో బ్యానర్ ఐటెమ్స్ రాయించుకుంటూ ఉంటే బాధ్యత పూర్తి అవుతుందా అన్నదే తమ్ముళ్లకు పట్టుకున్న ఆవేదన. కానీ చంద్రబాబు మాత్రం హైదరాబాద్ కదిలి రావడంలేదు.జగన్ సర్కార్ మీద వ్యతిరేకత వస్తే తానే మళ్ళీ ఏపీ జనాలకు గుర్తుకువస్తాను అన్న ధీమాలో చంద్రబాబు ఉన్నారని చెబుతారు. నిజమే ఈ రోజుకి కూడా వైసీపీకి గట్టి ప్రతిపక్షం టీడీపీనే. ఆ పార్టీకి గ్రాస్ రూట్ లెవెల్ లో కార్యకర్తలు ఉన్నారు. పటిష్టమైన యంత్రాంగం ఉంది. కానీ అవన్నీ కూడా అధినాయకుడు కదిలించినపుడే కదా ఉత్తేజమయ్యేది. ఎంతసేపూ కోర్టులలో కేసులు వేస్తూ న్యాయ పోరాటాల ద్వారానే చంద్రబాబు కాలం గడిపేస్తున్నారు. దీన్ని చూసిన వారు బాబులో మునుపటి ఉత్సాహం లేదని అనేస్తున్నారు. ఆయనకు కూడా రాజకీయం ఏంటో అర్థం కావడంలేదుట. తాను వేస్తున్న ప్రతీ బాణం వెనక్కి తిరిగి వచ్చేస్తోంది. దాంతో కాలానికే వదిలిపెట్టి బాబు వేచి చూసే ధోరణిలో ఉన్నారని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పుకోవాలంటే జగనే తనకు తానుగా చెడగొట్టుకుని చంద్రబాబుకు పీఠం అప్పగిస్తాడన్నదే బాబు టీమ్ ఆశగా ఉందిట. మరి జగన్ ఈ పరిణామాలను చూసి అతి ధీమాకు పోకుండా జనం మనసు ఎరిగేలా వ్యవహరిస్తే మాత్రం కాలం తీర్పు ఆయనకే అనుకూలంగా ఉంటుంది అంటున్నారు

# రఘువీరా రీ ఎంట్రీ...



అనంతపురం, జూలై 7, (న్యూస్ పల్స్)రఘువీరారెడ్డి. కాంగ్రెస్ పార్టీ నవ్యాంధ్ర మాజీ అధ్యక్షుడు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ బాధ్యతలను చేపట్టిన ఆయన రెండు ఎన్నికల్లో కీలక పాత్ర పోషించారు. అయితే.. 2014, 2019 ఎన్నికల్లో పార్టీ కనీసం ఒక్క స్థానంలోనూ విజయం దక్కించుకోకపోవడంతో ఆయన ఒకింత హర్ట్ అయ్యారు. దీంతో పార్టీ నుంచి దూరంగా ఉన్నారు. చివరకు ఈ రెండు ఎన్నికల్లోనూ ఆయన పెనుగొండ, కళ్యాణదుర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా కూడా విజయం సాధించలేకపోయారు. కాంగ్రెస్‌లో ఈదడం తన వల్ల కాదనుకున్నారో ఏమో గాని పార్టీ అధ్యక్ష పదవిని స్వతంత్రంగానే వదులుకున్నారు. రాహుల్‌కు మద్దతుగా తాను రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఇక, అప్పటి నుంచి రఘువీరా అనంతపురంలోని తన సొంత నియోజకవర్గంలో వ్యక్తిగత జీవనం గడుపుతున్నారు.అయితే.. ఇప్పుడు ఈయన అవసరం కాంగ్రెస్‌కు వచ్చిందని అంటున్నారు పార్టీ నేతలు. ఎందుకంటే.. ప్రస్తుతం.. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దారుణంగా ఉంది. అంతేకాదు.. ఎక్కడికక్కడ.. నాయకులు నిరాసక్తతతో ఉన్నారు. ఉన్నదే కొద్ది మంది అయినా.. ఉన్నవారు కూడా తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. అటు ఆర్థికంగా.. ఇటు రాజకీయంగా కూడా నేతలు పుంజుకోలేక పోతున్నారు. దీంతో ఇప్పుడు అందరి చూపూ.. రఘువీరారెడ్డి వైపు చూస్తున్నారనేది వాస్తవం. అయితే.. రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్.. సాకే శైలజానాథ్ ఉన్నారు కదా అనే అనుమానం వస్తుంది. సాకే వల్ల పార్టీ పుంజుకోలేక పోతోందని.. సీనియర్ల వాదన. రఘువీరారెడ్డి ఉన్నప్పుడు.. అప్పటి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.అదేవిధంగా .. తన వ్యాఖ్యలతో రాజకీయాలలో వేడి పుట్టించారు. సీనియర్లతోనూ కలుపుగోలుగా ఉన్నారు. దీంతో పార్టీ పుంజుకుంటుందనే ఆశలు.. ఉండేవి. రఘువీరారెడ్డి ఇటు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు అటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని పాయింట్ పాయింట్ టచ్ చేస్తూ విమర్శలు చేయడంతో పాటు నిరసనలు చేస్తూ వార్తల్లో ఉండేవారు. కానీ, ఇప్పుడు సాకే శైలజానాథ్ వాయిస్ గట్టిగా వినిపించడం లేదు. పైగా ప్రభుత్వాన్ని టార్గెట్ చేయడంలోను.. పార్టీని పుంజుకునేలా చేయడంలోను సాకే విఫలమవుతున్నారనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు అందరి చూపూ.. మళ్లీ రఘువీరారెడ్డి అయితే.. బెటర్ అని అంటున్నారు సీనియర్లు. మరి ఆయన ఏం చేస్తారో ? అటు కాంగ్రెస్ అధిష్టానం ఏం చేస్తుందో ? చూడాలి.

# మోడీపైనే కమలం ఆశలు




విజయవాడ, జూలై 7, (న్యూస్ పల్స్)ఏపీ సీఎం జగన్ దూకుడుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బ్రేకులు వేస్తుందా ? వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని.. సంచలన నిర్ణయాల దిశగా ముందుకు సాగుతుందా? ఇవీ గడిచిన కొద్ది రోజులుగా మరీ ముఖ్యంగా సీఎం జగన్ ఢిల్లీ టూర్ తర్వాత.. రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్న చర్చ. దీనికి రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి ఇటీవల తిరుపతి ఉప ఎన్నికల్లో బీజేపీ ఘోర పరాభవానికి గురి కావడం. రెండు వచ్చే ఎన్నికల్లో పుంజుకునే విషయంపై సందేహాలు వ్యక్తం అవుతుండడం. దీంతో రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసే విషయంపై కేంద్రంలోని పెద్దలు.. జోక్యం చేసుకుంటున్నారని రాజకీయ నేతలు భావిస్తున్నారు.రాష్ట్ర బీజేపీ నేతల వ్యవహారానికి వచ్చే సరికి.. జగన్ దూకుడుకు కళ్లెం వేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. ప్రస్తుతం బీజేపీ పుంజుకునే పరిస్థితిలో లేదని.. కానీ, జగన్ దూకుడుకు కొంతమేరకు అడ్డుకట్టపడితే.. పుంజుకునేందుకు అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఇక, మరోవైపు.. రాజకీయంగా తమకు అనుకూల వాతావరణం ఏర్పడాలంటే.. వైసీపీకి అడ్డంకులు ఏర్పడాలనే ఆలోచన కూడా కనిపిస్తోంది. వాస్తవానికి ఇతర రాష్ట్రాల్లో బీజేపీ పుంజుకునేందుకు.. అక్కడి గవర్నర్‌లు దోహదపడ్డారనే వాదన ఉంది. బెంగాల్‌లో 4 నుంచి 74 సీట్లు దక్కించుకోవడం వెనుక.. రాజకీయ నేతలతోపాటు ప్రథమ పౌరుడు కూడా ప్రధానంగా ఉపయోగపడ్డారనే రాజకీయ విశ్లేషణలు ఉన్నాయి.ఇక, ఢిల్లీ, పుదుచ్చేరి సహా.. ఇతర బీజేపీ యేతర రాష్ట్రాల్లో గవర్నర్‌ల దూకుడు కారణంగానే బీజేపీ ఒకింత బలపడిందని.. అక్కడి ప్రభుత్వాలను ఇరుకున పెట్టడం ద్వారా నిత్యం వార్తల్లో నిలిచిన గవర్నర్లు కూడా ఉన్నారని విశ్లేషకులు చెబుతున్నారు. పొరుగున ఉన్న తెలంగాణలోనూ గవర్నర్.. ఏకంగా ప్రభుత్వ బాధ్యతలు నిర్వహించడం కొన్నాళ్ల కిందట వివాదాస్పదం అయింది. అయితే.. ఏపీలో మాత్రం గవర్నర్‌కు, సీఎంకు మధ్య మంచి రెపో కొనసాగుతోందనే చర్చ జరుగుతోంది.దీంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా తాము ఏంచేసినా.. ప్రయోజనం ఉండడం లేదనేది బీజేపీ నేతల మాట. ఈ క్రమంలోనే ఇప్పుడు వారంతా కూడా కేంద్రంలోని మోడీ సర్కారు నిర్ణయంపైనే ఆశలు పెట్టుకున్నారు. జగన్‌కు అడ్డుకట్ట వేయాలంటే..కేంద్రం చేతుల్లోనే ఉందని.. అది ఏ రూపంలో అయినా కావొచ్చని నాయకులు భావిస్తుండడం గమనార్హం. మరి మోడీ ఏం చేస్తారో చూడాలి.

# వివేకా కేసులో అవినాష్ పేరు...

కడప, జూలై 7, (న్యూస్ పల్స్)డప ఎంపీ మార్పు జరుగుతుందా ? వచ్చే ఎన్నికల్లో ఇక్కడ నుంచి వైసీపీ అభ్యర్థిగా కొత్త మొహం వెలుగులోకి వస్తుందా ? అంటే.. వైసీపీ నేతలే.. ఔనని అంటున్నారు. అయితే దీనికి ఒక షరతు ఉందని చెబుతున్నారు. ఈ నియోజకవర్గానికి సంబంధించి అనూహ్య పరిణామాలు జరిగితేనే ఈ మార్పు ఉంటుందని అంటున్నారు. విషయంలోకి వెళ్తే.. కడప పార్లమెంటు స్థానం నుంచి సీఎం వైఎస్ జగన్ కజిన్ వైఎస్ అవినాష్ రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఇప్పటికే వరుసగా రెండుసార్లు ఆయన కడప ఎంపీగా గెలుస్తూ వస్తున్నారు. ఇప్పుడు ప్రభుత్వం కూడా అధికారంలో ఉండడంతోసీఎం కనుసన్నల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.నిత్యం పార్టీకి టచ్‌లో ఉంటూ.. పార్లమెంటులోనూ గట్టి గళం వినిపిస్తున్నారు. ప్రభుత్వానికి అనుకూలంగా కేంద్ర మంత్రులను కలుస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలపైనా మాట్లాడుతున్నారు. ఇప్పటికైతే.. ఎలాంటి అవినీతి ఆరోపణలు కూడా అవినాష్‌కు అంటలేదు. ఇక, సీఎం జగన్ దగ్గరా ఆయనకు మంచి మార్కులే ఉన్నాయి. మరి ఇన్ని పాజిటివ్‌లు ఉన్నప్పుడు అవినాష్ రెడ్డిని ఎందుకు పక్కన పెడతారు ? అనేది కీలక ప్రశ్న. ఇక్కడే ఉంది.. అసలు విషయం. మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి పేర్లు వినిపిస్తున్న విషయం తెలిసిందే.ప్రస్తుతం ఈ కేసును సీబీఐ విచారిస్తోంది. ఇటీవలే వివేకా కుమార్తె, ఆయన సతీమణిలను కూడా విచారించిన సీబీఐ అధికారులు కీలక విషయాలను రాబట్టారు. ఈ క్రమంలో వారు గతంలో పేర్కొన్నట్టుగానే.. ఈ కేసులో అవినాష్, ఆయన తండ్రి పాత్ర ఉందని.. ముందు వారిని విచారించాలని.. కోరారని.. తెలుస్తోంది. దీంతో కొద్దిరోజుల్లో అవినాష్ రెడ్డిని విచారించే అవకాశం ఉందని సమాచారం. ఇక, ఈ కేసు విచారణ పుంజుకుని.. వివేకా కుటుంబం ఆరోపించినట్టుగా సీబీఐ అధికారులు అవినాష్ రెడ్డిపై చర్యలు తీసుకుంటే.. రాజకీయంగా వైసీపీలో పెను మార్పులు వస్తాయని చెబుతున్నారు.ఈ క్రమంలోనే వచ్చే ఎన్నికలనాటికి అవినాష్ రెడ్డిని తప్పిస్తారని అంటున్నారు. వివేకా కేసు కనుక అవినాష్‌కు చుట్టుకుంటే.. ప్రజల్లో సింపతీ పోయే పరిస్థితి ఉందని.. ఈ క్రమంలో ఆయనను తప్పించడం ఖాయమని అంటున్నారు.

# గోవా బీచ్...లానే విశాఖ బీచ్

విశాఖపట్టణం, జూలై 7, (న్యూస్ పల్స్)గోవా బీచ్ కి టూరిస్టుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అక్కడ స్వేచ్చగా ఎంజాయ్ చేస్తారు. దానికి కావాల్సిన పరిస్థితులు అన్నీ అక్కడ ఉంటాయి. గోవాకు మొత్తం ఆదాయం అంతా టూరిజం నుంచే వస్తోంది. ఇపుడు ఏపీ సర్కార్ కూడా అలాగే ఆలోచిస్తోంది. విశాఖ నుంచి భోగాపురం దాకా ఉన్న యాభై కిలోమీటర్ల బీచ్ ప్రాంతాన్ని అంతా గోవా మాదిరిగా అభివృద్ధి చేయాలని సంకల్పిస్తోంది. ఇందుకోసం కార్యాచరణను కూడా రెడీ చేసి పెట్టుకుంది. విశాఖ బీచ్ కారిడార్ కార్పోరేషన్ ని కూడా ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తోంది.ఇన్నాళ్ళూ విశాఖ బీచ్ కి పర్యాటకులు వస్తే కెరటాలు చూస్తూ కూర్చోవడమే టైమ్ పాస్ గా ఉండేది. ఇపుడు అలా కాదు ఆనందానికి ఏమేమి కావాలో అవన్నీ సమకూర్చబోతున్నారు. అందుకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కార్పోరేషన్ టూరిజం డెవలప్మెంట్ తో పాటు, కమర్షియల్ గానూ సక్సెస్ అయ్యేలా ప్రాజెక్టులను డిజైన్ చేయనుంది. ఇక వీటికి అవసరమైన మౌలిక



సదుపాయాలను కూడా సమకూర్చనుంది. ఈ కార్పోరేషన్ ద్వారానే రానున్న రోజుల్లో బీచ్ కారిడార్ మొత్తం పనులు సాగుతాయని చెబుతున్నారు.ప్రతీ ఏటా విశాఖకు వచ్చే టూరిస్టులు ఎక్కువగానే ఉంటారు. వారి సంఖ్యను ఇంకా పెంచుకోవాలంటే బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలని జగన్ ఆలోచిస్తున్నారు. అందుకోసం గోల్ఫ్ కోర్టులు, ఎమ్యూజ్మెంట్ పార్కులు, రిసార్టులు, ఫ్లోటింగ్ షిప్ రెస్టారెంట్ వంటివి కూడా ఏర్పాటు చేస్తారని అంటున్నారు. మౌలిక సదుపాయాల విషయానికి వస్తే బీచ్ రోడ్ కారిడార్ లో తొమ్మిది బీచ్ లు వస్తాయని మంత్రి అవంతి శ్రీనివాసరావు చెబుతున్నారు. ఎటు వైపు వెళ్ళినా కూడా టూరిస్టులకు పూర్తి సదుపాయాలు ఉండేలా డిజైన్ చేస్తామని చెబుతున్నారు.నాడు చంద్రబాబు కూడా విశాఖ బీచ్ మీద కన్నేశారు. ఆయన బికినీ ఫెస్టివల్ బీచ్ లో నిర్వహించాలని చూశారు. అయితే విపక్షాలు అడ్డుకోవడంతో అది ఆగింది. ఇపుడు జగన్ సర్కార్ దానిని మించి అన్నట్లుగా అన్ని రకాల వినోదాల విన్యాసాలు తీసుకు వస్తుంది అంటున్నారు. ఒక విధంగా విదేశీ టూరిస్టులకు ఆకట్టుకునే విధంగా ఇక్కడ ప్రాజెక్టులు ఉంటాయని అంటున్నారు. ఇందుకోసం 1021 కోట్ల రూపాయలతో 570 ఎకరాలలో బీచ్ కారిడార్ డెవలపమెంట్ కార్పోరేషన్ అనేక కార్యక్రమాలు చేపట్టనుంది.

# పార్టీని పట్టాలెక్కించేందుకు నానా యాతన

గుంటూరు, జూలై 7, (న్యూస్ పల్స్)రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీని పరుగులు పెట్టించేందుకు పార్టీ అధినేత చంద్రబాబు శ్రమిస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూనే.. మరోవైపు. పార్టీని కూడా గాడిలో పెడుతున్నారు. నిన్న మొన్నటి వరకు ఇంచార్జ్‌లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నియోజకవర్గాల్లో ఇంచార్జ్‌లను నియమిస్తున్నారు. తిరువూరు, భీమిలి, మాచర్ల లాంటి నియోజకవర్గాలను కూడా ఆయన ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ వస్తున్నారు. పార్టీ ఇన్‌చార్జ్‌లు లేక కష్టాల్లో ఉన్న అన్ని నియోజకవర్గాల్లోనూ వరుస పెట్టి అభ్యర్థులను నియమిస్తోన్న చంద్రబాబు గుంటూరు జిల్లాలో పార్టీకి కంచుకోటగా ఉన్న సత్తెనపల్లి ఇన్‌చార్జ్ విషయంపై మాత్రం బాబు ఏమీ తేల్చలేదు. ఇక్కడ ఆయన దాగుడు మూతలు ఆడుతున్నారా? లేక.. వేచి చూస్తున్నారా? అనే ప్రశ్నలు తెరమీదికి వస్తున్నాయి.సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు.. మరణించారు. దీంతో ఇక్కడ పార్టీ ఏకాకిగా మారింది. అయితే.. ఈ పదవిని దక్కించుకునేందుకు ప్రస్తుతం ఇక్కడ నలుగురు నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. కోడెల తనయుడు డాక్టర్ శివరామ కృష్ణ తనకు నియోజకవర్గ ఇన్ చార్జ్ పదవి ఇవ్వాలని కోరుతున్నారు. అయితే.. ఆయనపై గతంలో కొన్ని ఆరోపణలు ఉన్న నేపథ్యంలో చంద్రబాబు వెనుకాడుతున్నట్టు కనిపిస్తోంది. అలాగని కోడెల ఫ్యామిలీని పక్కన పెట్టడం కూడా లేదు. అదే సమయంలో టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు తనయుడు రాయపాటి రంగారావు కూడా ఇక్కడ పదవి ఇవ్వాలని పట్టుబడుతున్నారు.ఈయన విషయాన్ని కూడా చంద్రబాబు పరిశీలనకు తీసుకోవడం లేదు. నిజానికి ఈయన నాయకత్వంపై అధినేతకు నమ్మకం ఉన్నా, వారి కుటుంబంలో ఇదే విషయంపై జరుగుతున్న వివాదం నేపథ్యంలో చంద్రబాబు వెనుకడుగు వేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇక, రాజధాని ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న రాయపాటి కుటుంబానికి చెందిన శైలజ ఇక్కడి బాధ్యతలు చూస్తానని అంటున్నట్టు సమాచారం. ఈ క్రమంలోనే రంగారావు విషయంలో నిర్ణయం తీసుకోవడం లేదంటున్నారు.సత్తెనపల్లిలో రాయపాటి ఫ్యామిలీకి బలమైన వర్గం ఉంది. ఇక రాజధాని ఉద్యమంలో శైలజ చాలా యాక్టివ్‌గా ఉంటున్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్మే వై. ఆంజనేయులు ఇటీవల కాలంలో ఇక్కడ క్రియాశీలకంగా తిరుగుతున్నారు. చలపలి విద్యాసంస్థల అధినేతగా ఉన్న ఆయన 1999లోనే టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. తనకు బాధ్యతలు అప్పచెపితే వచ్చే ఎన్నికల్లోటీడీపీ జెండా ఇక్కడ ఎగురవేస్తానని ఆయన చెబుతున్నారు. ఇలా సత్తెనపల్లిలో టీడీపీ పరిస్థితి నాలుగు స్తంభాలటగా మారిందని అంటున్నారు పరిశీలకులు. మరి చంద్రబాబు ఏం చేస్తారో చూడాలి

# ఉద్యోగ. కార్మిక సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొండివైఖరి విడనాడాలి

నంద్యాల జూలై 7, (న్యూస్ పల్స్) సంఘటిత అసంఘటిత రంగ కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మొండివైఖరి విడనాడాలని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కె ప్రసాద్ ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి సుబ్బరాయుడు ఏఐటీయూసీ నాయకులు నాగేశ్వరయ్య నాగేంద్ర శివన్న అన్నారు. అనంతరం సిపిఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజా . కార్మిక. కర్షక వ్యతిరేక విధానాలతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నది. పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచడం వలన నిత్యావసర సరుకుల ధరల కు రెక్కలు రావడం జరిగిందన్నారు. పేద మధ్య తరగతి ప్రజలు కార్మికులు పేరుగుతున్న ధరలను చూసి బెంబేలు ఎత్తుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం . కేంద్ర ప్రభుత్వం చెప్పినదాని కల్లా తల ఊపుతూ రాష్ట్ర ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నది కేంద్ర ప్రభుత్వం ఆ దాని. అంబానీ లకు సంపదను జమ

### ఏఐటీయూసీ

కూర్చే దానిలో భాగంగా లాభాల బాటలో నడిచే ప్రభుత్వ సంస్థలను ప్రైవేటు వారికి అప్పజెప్పి కార్మికులను ఉద్యోగులను రోడ్డుపాలు చేస్తున్నదని అన్నారు. స్వాతంత్రం రాక మునుపు నుండి కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్లు గా విభజించి కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేసే ప్రయత్నం చేస్తున్నది అని అన్నారు.

# ఇంటర్ మార్కులపై నిర్ణయం

విజయవాడ, జూలై 7, (న్యూస్ పల్స్)ఏపీలో కరోనా కారణంగా ఇంటర్ పరీక్షలు రద్దయిన విషయం తెలిసిందే. ఈ ఇంటర్ పరీక్షా ఫలితాల ప్రాతిపదికను ఏపీ విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ ప్రకటించారు. ఇంటర్ సెకండియర్ మార్కులపై కూడా సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారని మంత్రి ఆదిమూలపు సురేష్ స్పష్టం చేశారు. 10వ తరగతి మార్కులు 30 శాతం, ఇంటర్ ప్రథమ సంవత్సరం మార్కులు 70 శాతం ప్రాతిపదికగా విద్యార్థులకు సెకండియర్ మార్కులు కేటాయిస్తామని అన్నారు. ఈ నెలాఖరులోపు మార్కుల మెమోలను జారీ చేస్తామని తెలిపారు. ఇక.. ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాలల పునఃప్రారంభంపై విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆగష్టు 16 నుంచి స్కూల్స్ తిరిగి ఓపెన్ చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అలాగే విద్యార్థులకు ఈ నెల 12వ తేదీ నుంచి ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తామని అన్నారుఆంధ్రప్రదేశ్‌లోని గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి (ఇంగ్లీష్ మీడియం) ప్రవేశాల కోసం దరఖాస్తులకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తున్న 38 సాధారణ, 12 మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి సంస్థ కార్యదర్శి ఎంఆర్ ప్రసన్న కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం.. విద్యార్థులు 2021-22 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

# లారీ బోల్తా?తప్పిన ప్రమాదం

విశాఖపట్నం జూలై 7, (న్యూస్ పల్స్)విశాఖ ఆర్.కే బీచ్ రోడ్ లో బుధవారం ఉదయం ఒక ప్రమాదం తృటిలో తప్పింది. నోవెటెల్ డౌన్ నుండి పెద్ద పెద్ద రాళ్ళ తో వస్తున్న ఒక లారీకి బ్రేక్ ఫెయిల్ అయింది.డ్రైవర్ అదుపు చేయడానికి ప్రయత్నించాడు. అంతో లారీ బీచ్ రోడ్డులో బోల్తా పడింది. ప్రమాదాన్ని పసిగట్టిని వాకర్స్ పరుగులుపెట్టి ప్రాణాలు దక్కించుకున్నారు. ఎవరికీ ప్రమాదం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గతంలోనూ ఇక్కడ ఇదే తరహా ప్రమాదాలు చోటు చేసుకున్నాయని స్థానికులు అంటున్నారు.

# ప్రేమించిన యువతిని నిర్బంధించిన ప్రియుడు

ఏలూరు జూలై 7, (న్యూస్ పల్స్)మాజీ ప్రియురాలిని ఇంట్లో బంధించిన వైనం ఇది. పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం మండలం నవుడూరులో జరిగింది. నవుడూరుకు చెందిన రమేష్, బెంగుళూరు కు చెందిన యువతి ఇద్దరూ ప్రేమించుకున్నారు. అయితే రమేష్ ఇటీవల వేరే అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయం తెలిసి బెంగుళూరు నుండి రమేష్ ఇంటికిఆ ప్రియురాలు వచ్చింది. రమేష్ ఆమెను ఇంట్లో నిర్బంధించి బెదిరింపులకు గురిచేసాడు. దీనికి అతని తల్లిదండ్రులు, స్నేహితులు కుడా తోడయ్యారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వీరవాసరం పోలీసులు నవుడూరుకు చేరుకున్నారు. నిర్బంధంలో ఉన్న అమ్మాయిని విడిపించారు. బాధిత యువతి, ప్రియుడు రమేష్, అతని తల్లిదండ్రుల పై ఫిర్యాదు చేసింది. దాంతో పోలీసులు రమేష్ ,మరో ఏడుగురు పై కేసులు నమోదు చేసారు.

# గన్నవరం మండలం కేసరపల్లి జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం.

### లారీ అదుపు తప్పి బోల్తా

### ప్రమాదంలో ముగ్గురు మృతి

విజయవాడ జూలై 7, (న్యూస్ పల్స్)కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి చైన్నై కలకత్తా జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ అదుపు తప్పి బోల్తా పడింది. లారీ లోడు పై ప్రయాణం చేస్తున్న తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం కి ఒకే కుటుంబానికి చెందిన భార్యభర్తల కొమ్మేటి శ్రీనివాసరావు(27) రాజ్యలక్ష్మి(29),రోహిత్ (2) అనే బాలుడు ముగ్గురు మృతి చెందారు. క్లీనర్ లారీ నడపడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. గన్నవరం ఎస్ ఐ రమేష్ పోలీసులు ,ట్రాఫిక్ సిబ్బంది ప్రమదస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్రేన్ సాయంతో లారీని బయటకు తీసారు.

# శ్రీశైలంలో భక్తులకు మొక్కుల కష్టాలు

శ్రీశైలం జూలై 7, (న్యూస్ పల్స్)ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలం మహాక్షేత్రంలో భక్తులు ఎవరిగుండు వారే గీసుకుంటున్నారు శ్రీశైలంలోని తలనీలాల కళ్యాణకట్ట గత నెల రోజులుగా మూత పడింది కళ్యాణకట్టలో విధులు నిర్వహించే ఉద్యోగులకు కొందరికి కరోన పాజిటివ్ వచ్చింది దీనితో దేవస్థానం అధికారులు గత నెల రోజులుగా కళ్యాణకట్ట తాత్కాలికంగా మూసివేశారు స్వామివారికి తలనీలాలు ఇచ్చేందుకు శ్రీశైలం మల్లన్న దర్శనానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులెదుర్కుంటున్నారు మల్లికార్జున స్వామివారికి తలనీలాలు ఇస్తామని మొక్కులు మొక్కుకున్న భక్తులు శ్రీశైలం వచ్చి మొక్కులు తీర్చుకునేందుకు వీలు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకోకుండా వెళ్లలేక శ్రీశైలంలోని కళ్యాణకట్ట వద్దే సందులలో భక్తులు ఒకరి గుండు మరోకరు గీసుకుంటూ ఒకరికోకరు సహకరించుకుంటూ భక్తులు గుండ్లు గీసుకుంటూ అష్టకష్టాలు పడుతున్నారు తలనీలాలు ఇచ్చే క్రమంలో గుండ్లు గీసుకోవడం తెలియక తలకు గాట్లు పెట్టుకుంటు ఇబ్బందులు పడుతూ భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు. దేవస్థానం అధికారులు కళ్యాణకట్ట తెరిచి ఉంటే భక్తుల మొక్కులు తీర్చుకునేందుకు వీలుగా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# చిత్తూరు జిల్లాలో ఆగని ఎర్రచందనం అక్రమ రవాణా

చిత్తూరు జూలై 7, (న్యూస్ పల్స్)చిత్తూరు జిల్లాలో ఎర్రచందనం అక్రమ రవాణా ఆగడంలేదు. ఈ నేపథ్యంలో పలుచోట్ల అటవీశాఖ అధికారులు. నాకాబంది నిర్వహిస్తున్నారు. తాజాగా శాంతిపురం మండలం కడపల్లి వద్ద నాకాబందినుంచి స్కార్పియో దూసుకుపోయింది. రో ఇన్నోవా వాహనం అనుమాస్పదం రావడంతో వెంబడించి తనిఖీ చేయడంతో ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. తొమ్మిది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నింధితులు పరారీ అయ్యారు. స్కార్పియో,ఇన్నోవా వాహనాలను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# ఏపీకి పరిశ్రమలు ఎప్పుడు

విజయవాడ, జూలై 7, (న్యూస్ పల్స్)గన్ రాజకీయాల్లోకి రాకపోయి ఉంటే ఏమి చేసేవారు అన్న సందేహం ఎవరికైనా రావచ్చు. దానికి సమాధానం కూడా ఉంది. జగన్ కచ్చితంగా పారిశ్రామికవేత్తగా స్థిరపడతారు అని చెబుతారు. నిజానికి వైఎస్సార్ కి తన వారసులను రాజకీయాల్లోకి తేవాలన్న కోరిక ఏదీ లేదు. ఆయనే కాంగ్రెస్ రాజకీయాలతో విసిగిపోయారు. వర్గ పోరు మూలంగా చేతికి అందాల్సిన సీఎం పదవి ముప్ఫయ్యేళ్ళు ఆలస్యంగా దక్కింది. దాంతో తనతోనే కుటుంబంలో రాజకీయాలు స్వస్తి అనే ఆయన అనుకున్నారని చెబుతారు. కానీ జగన్ వత్తిడి మేరకే ఆయన 2009 ఎన్నికల్లో ఎంపీ టికెట్ ఇప్పించి గెలిపించారు. అలా అడుగుపెట్టిన జగన్ తండ్రి మరణాంతరం నేరుగా డైరెక్ట్ పాలిటిక్స్ లోకి రావాల్సి వచ్చింది. అలా ఆయన సీఎం అయిపోయారు.జగన్ సీఎం అయితే ఏపీ దశ, దిశ మారుతుందని చాలా మంది ఊహించారు. దానికి అనేక కారణాలు ఉన్నాయి. స్వతహాగా జగన్ మంచి పారిశ్రామికవేత్త. ఆయన ఈ రాజకీయాల్లోకి రాకపోయి ఉంటే దేశంలోని అగ్ర పారిశ్రామికవేత్తలలో ఒకరుగా ఉండేవారు అని ఆయన గురించి తెలిసిన వారు చెబుతారు. అలాంటి జగన్ తాను సీఎం గా ఉండగా ఏపీకి పారిశ్రామిక కళ రాకపోవడం నిజంగా బాధాకరమైన విషయమే. చంద్రబాబుతో పోల్చుకుంటే జగన్ యువ నాయకుడు. పారిశ్రామికవేత్తలతో మంచి పరిచయాలు ఉన్నాయి. ఆయనకు పారిశ్రామిక రంగం గురించి సంపూర్ణ అవగాహన ఉంది. మరి అటువంటి జగన్ రెండేళ్ల ఏలుబడిలో ఒక్క పరిశ్రమ కూడా రాకపోవడం నిజంగా మచ్చగానే చూడాలేమో.జగన్ తన దృష్టికి ఒక వైపే పెట్టేశారు. ఆయన తాడేపల్లి నివాసం నుంచి బయటకు రావడంలేదు. సంక్షేమ క్యాలెండర్ ని ఆయన తుచ తప్పకుండా అమలు చేస్తున్నారు. ఆ విషయంలో ఆయన శ్రద్ధాసక్తులను మెచ్చుకుని తీరాల్సిందే. కానీ అదే సమయంలో ఏపీ అభివృద్ధి మీద నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. బాధ్యత కలిగిన సీఎం గా ఆయన రెండవ వైపు కూడా చూడాలి కదా అన్న మాట ఉంది. జగన్ తన పరిచయాలను బయటకు తీసి ఏపీలో పరిశ్రమలు పెట్టించే విధంగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది అన్న మాట అయితే ఉంది. ఇక పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ రెడ్డి కూడా సమర్ధుడే. కానీ ఎందుకో వైసీపీ సర్కార్ కి సరైన పారిశ్రామిక విధానం లేదు అన్న ప్రచారం అయితే జోరుగా సాగుతోంది. తాజాగా చిత్తూరు జిల్లా నుంచి రియలెన్స్ కంపెనీ బయటకు వెళ్ళిపోవడంతో జగన్ సర్కార్ కి అతి పెద్ద దెబ్బ పడినట్లు అయింది.జగన్ ముందు మూడు రాజధానుల చిక్కు ముడి విప్పాలని చూస్తున్నారుట. విశాఖను పాలనా రాజధాని చేసుకుంటే ఆటోమేటిక్ గా పరిశ్రమలు పెట్టేవారు వస్తారని ఆయన అంచనా వేసుకుంటున్నారుట. నిజమే హైదరాబాద్ కి కూడా లేని అదనపు సదుపాయాలు విశాఖకు ఉన్నాయి. దాన్ని రాజధాని అంటే కచ్చితంగా పెట్టుబడులు వస్తాయి. చంద్రబాబు టైమ్ లో కూడా విశాఖలోనే పెట్టుబడులు పెడతామని పలువురు ప్రతిపాదించారని, ఆయన అమరావతి అనడంతోనే వారు వెనక్కి మళ్ళారని చెబుతారు. మరి జగన్ విశాఖ విజన్ తో ముందుకు వెళ్తున్నారు. కానీ ఇప్పటికే పుణ్య కాలం గడిచింది. రాజధాని అన్నది న్యాయ సమీక్ష లో ఉంది. దాంతో అంతవరకూ ఆగకుండా జగన్ ఏపీలో పెట్టుబడులను ఆకట్టుకునేలా గట్టిగా కృషి చేయాలని అంటున్నారు. అదే సమయంలో పరిశ్రమ మంత్రి అయినా విదేశీ పర్యటలను చేసి ఏపీ వైపుగా వారు చూసేలా చర్యలు చేపట్టాలని సూచనలు అందుతున్నారు. మొత్తం మీద జగన్ మదిలో ఏముందో కానీ టీడీపీకి ఈ విషయంలో అడ్డంగా దొరికేస్తున్నారు అన్నది మాత్రం నిజం.

# ఎవ్వరికి దక్కకూడదనే హత్య

నెల్లూరు, జూలై 7, (న్యూస్ పల్స్)రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన నెల్లూరు జిల్లాలో గూడూరుకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని తేజస్విని హత్య కేసును పోలీసులు చేధించారు. తామిద్దరం ఆత్మహత్యకు యత్నించామని ఇన్నాళ్లు కట్టుకథలు చెప్పిన వెంకటేశ్వర్లే అసలు నిందితుడని తేల్చారు. తేజస్విని తనను దూరం పెడుతోందన్న కారణంతోనే ఆమెను హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడు వెంకటేశ్వర్లును పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఈ కేసు విషయాలను ఏఎస్పీ వెంకటరత్నం మీడియాకు వివరించారు.గూడూరుకు చెందిన పి.సుధాకర్, సరిత దంపతులు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరికి కుమార్తె తేజశ్వని, కుమారుడు కార్తీక్ ఉన్నారు. తేజశ్వని ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతోంది. సుధాకర్ సహోద్యోగి చెంచుకృష్ణయ్యతో వీరి కుటుంబంతో ఏడేళ్లుగా పరిచయం ఉంది. ఈ క్రమంలోనే ఆయన కుమారుడు వెంకటేశ్వర్లుతో తేజస్వినికి పరిచయం ఏర్పడింది. కొంతకాలం తర్వాత ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని వెంటపడేవాడు. ఇద్దరి మధ్య వయసు తేడా ఎక్కువ ఉండటంతో పెద్దలు వీరి పెళ్లికి నిరాకరించారు.ఈ క్రమంలో తేజస్విని తన మొబైల్ నెంబర్‌ని కూడా మార్చేసింది. అయితే, తనకు దక్కని తేజస్విని ఎవరికీ దక్కకూడదని భావించిన వెంకటేశ్వర్లు ఆమెను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ప్లాన్ ప్రకారం ఈ నెల ఒకటో తేదీన తేజస్విని ఇంటికి వెళ్లి వెంట తెచ్చుకున్న కత్తితో గొంతులో పొడిచాడు. అప్పటికే ఆమె చనిపోకపోవడంతో చున్నీతో గొంతు నులిమి చంపేశాడు. ఆ తర్వాత తానూ ఆత్మహత్య చేసుకున్నట్లు నమ్మించే ప్రయత్నం చేశాడు.అయితే పోలీసుల విచారణలో వెంకటేశ్వర్లు పక్కా ప్లాన్ ప్రకారమే తేజస్వినిని హత్య చేసినట్లు వెల్లడైంది. ఈ కుట్రలో అతడికి మరో ఇద్దరు స్నేహితులు కూడా సహకరించినట్లు గుర్తించారు. ఈ హత్య కేసులో వెంకటేశ్వర్లుని ఏ1 గా పేర్కొనగా.. పృథ్వీరాజ్ ఏ2, శివ ఏ3 గా చేరుస్తూ కేసు నమోదు చేశారు. సహ నిందితులను గతంలోనే అదుపులోకి తీసుకోగా.. ప్రధాన నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# ఆంధ్రప్రదేశ్‌లో ఆగస్టు 15 నుంచి పాఠశాలల ప్రారంభం

తాడేపల్లి జూలై 7 : ఆగష్టులోపు విద్యాసంస్థల్లో నాడు-నేడు పెండింగ్ పనులు పూర్తి కావాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. ఈనెల 15 నుంచి ఆగస్టు 15వరకు వర్క్‌బుక్స్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. నాడు-నేడు కింద పనుల కోసం రూ.16 వేల కోట్లతో బడ్జెట్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. నాడు నేడు, జగనన్న విద్యా కానుకపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష చేపట్టారు. ఆగష్టు 15 తర్వాత పాఠశాలలు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఆగష్టు 15 లోపు టీచర్లకు వ్యాక్సినేషన్ వేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆగష్టులోనే విద్యా కానుక, నాడు-నేడు రెండో విడత పనులు ప్రారంభం కావాలన్నారు.

తొలివిడత పనులు పూర్తైన పాఠశాలలను ప్రజలకు అంకితం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.నూతన విద్యా విధానంపై సమీక్షనూతన విద్యా విధానం అమలుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, విద్యావంతులైన నైపుణ్యం గల టీచర్లతో బోధన అందించాలని తెలదిపారు. మెరుగైన మౌలిక సదుపాయాలు, విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా టీచర్లు ఉండాలన్నారు. ఈ లక్ష్యాల కోసమే నూతన విద్యా విధానం అమలు చేస్తున్నామన్నారు. ఒక్క స్కూల్ మూసివేయకూడదని, ఒక్క టీచర్‌నూ తొలగించకూడదని ఆదేశించారు. నూతన విద్యా విధానం ప్రతిపాదనలను ఈ వారంలో ఖరారు చేయాలన్నారు. నాడు-నేడు పనులను యథావిధిగా కొనసాగించాలని, షెడ్యూల్ ప్రకారం పనులు పూర్తికావాలని అధికారులను ఆదేశించారు.

# నెలల తర్వాత కిడ్నాపర్ అరెస్ట్

తిరుపతి, జూలై 7, (న్యూస్ పల్స్)తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ ఆలయం సమీపంలో పోలీసులను చూసిన ఓ లారీ డ్రైవర్ కంగారుపడిపోయాడు. అక్కడి నుంచి పారిపోయేందుకు యత్నించడంతో అనుమానించిన పోలీసులు అతన్ని పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. అసలు విషయమేంటని వారి స్టైల్లో ఆరా తీయడంతో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. నాలుగు నెలల కిందట సంచలనం రేపిన కిడ్నాప్ కేసు పరిష్కారమైంది. తిరుపతిలో కిడ్నాప్‌కి గురైన బాలుడిని అపహరించింది అతనేనని తెలియడంతో పోలీసులు షాకయ్యారు. తీరా అతను చెప్పిన సమాధానం విని కంగుతిన్నారు.నాలుగు నెలల కిందట ఛత్తీస్‌గఢ్ నుంచి ఉత్తమ్ కుమార్ సాహూ కుటుంబం దైవ దర్శనానికి తిరుమల విచ్చేసింది. తిరుపతిలోని బాలాజీ లింకు బస్టాండ్ ఉత్తమ్ కుమారుడు శివం సాహూ(6) కనిపించకుండా పోయాడు. కంగారుపడిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించడంతో బాలుడిని కిడ్నాప్ చేసినట్లు తేలింది. ఈ ఘటన అప్పట్లో తీవ్ర కలకలం రేపింది. ఆరేళ్ల చిన్నారిని దుండగుడు అపహరించాడని తెలియడంతో మీడియాలో వరుస కథనాలు వెలువడ్డాయి.పోలీస్ యాక్షన్ సీరియస్‌గా ఉంటుందని భయపడిన కిడ్నాపర్ బాలుడిని విజయవాడలోని దుర్గ గుడి వద్ద వదిలేసి పారిపోయాడు. బాలుడు ప్రాణాలతో దొరకడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఆ కిడ్నాప్ చేసిన నిందితుడి కోసం పోలీపులు గాలిస్తున్నారు. ఈ నెల 6వ తేదీన తిరుపతి హరేరామ హరేకృష్ణ ఆలయం వద్ద పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించిన కర్ణాటకలోని ముళబాగల్ తాలూక పుట్టణహళ్లికి చెందిన శివప్రసాద్ అలియాస్ శివారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పారిపోతున్నావంటూ తమ స్టైల్లో విచారించడంతో బాలుడి కిడ్నాప్ కేసు మిస్టరీ వీడిపోయింది. బాలుడు శివం సాహూని కిడ్నాప్ చేసింది తానేనని.. చనిపోయిన తన చిన్నకొడుకులా ఉన్నాడని బాలుడిని అపహరించినట్లు చెప్పడంతో పోలీసులు ఆశ్చర్యానికి గురయ్యారు. నిందితుడిని అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టారు. నిందితుడు లారీ డ్రైవర్ కావడంతో హిందీతో మాట్లాడి బాలుడిని ఆకర్షించి తనతో తీసుకెళ్లినట్లు పోలీసులు వెల్లడించారు.

## గ్రామ వలంటీర్లను ఎలా వాడుకుంటున్నారంటే...

విజయవాడ, జూలై 7, (న్యూస్ పల్స్)రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇంటికి సమీపంలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ముందు ఏకరవు పెడుతున్నారు. దశాబ్దాలుగా అక్కడే ఉంటున్న తమను సీఎం భద్రత కోసం ఖాళీ చేయాలని వేధిస్తున్నారని వాపోతున్నారు. తాడేపల్లి కరకట్ట ప్రాంత ప్రజలు పవన్ కళ్యాణ్‌కు తమ గోడు తెలిపారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్‌కు ఓ మహిళా గ్రామ వాలంటీర్ చెప్పి మాటలు సంచలనంగా మారాయి.తాము ఎదుర్కొంటున్న వేధింపులు, సమస్యలను పవన్ కళ్యాణ్‌కు ఆ యువతి భావోద్వేగంతో చెప్పారు. ప్రస్తుతం ఆమె మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. గ్రామ వాలంటీర్లను ప్రభుత్వ పెద్దలు దారుణంగా వాడుకుంటున్నారని, జనాన్ని భయపట్టయినా సరే, అక్కడి నుంచి ఖాళీ చేయించాలని హుకుం జారీ చేశారని సంచలన విషయాలు బయటపెట్టారు.తాడేపల్లి కరకట్టపైన 120 ఇళ్లకు నేను వాలంటీర్‌గా పనిచేస్తున్నాను. ఇళ్లు పీకేసే క్రమంలో వాలంటీర్లను ఎలా వాడుకుంటున్నారంటే.. జనాన్ని భయపెట్టయినా సరే, అక్కడి నుంచి ఇళ్లు ఖాళీ చేయించాలని చెబుతున్నారు. ముఖ్యంగా మీ వాలంటీర్లు ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోతేనే మిగిలివారు కూడా బయటకు పోతారంటూ మమ్మల్ని కూడా బెదిరిస్తున్నారు.నా తండ్రికి 76 ఏళ్లు, నా తల్లికి 60 ఏళ్లు సార్. ఈ వయసులో వాళ్లు భయభ్రాంతులకు గురవుతున్నారు. నాకు గత మూడు నెలలుగా గౌరవవేతనం ఇవ్వకపోయినా సరే.. ఆ వేతనాన్ని వదిలేసుకుని మరీ మీ దగ్గరకు వచ్చాను. మీరు మాకు అండగా ఉంటారన్న ఒకే ఒక్క కారణంతో ఇక్కడికి వచ్చాను."

# త్వరలో తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు

విజయవాడ, జూలై 7, (న్యూస్ పల్స్)మరోసారి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉప ఎన్నికలకు సమయం దగ్గరపడింది. ఎన్నికల కమిషన్ కూడా ఉప ఎన్నికల తేదీలపై కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది. దేశంలో కరోనా పరిస్థితులు తగ్గుముఖం పడుతుండటంతో త్వరలోనే నోటిఫికేషన్ ను విడుదల చేసేందుకు ఎన్నికల కమిషన్ సిద్ధమయింది. తెలంగాణాలో హుజూరాబాద్, ఆంధ్రప్రదేశ్ లో బద్వేలు నియోజకవర్గాలకు సెప్టంబరు నెలలో ఉప ఎన్నికలు జరిగే అవకాశముంది.హుజూరాబాద్ లో మాజీ మంత్రి ఈటల రాజేందర్ రాజీనామాతో ఉప ఎన్నిక అనివార్యమయింది. ఇక్కడ ప్రధానంగా టీఆర్ఎస్, బీజేపీల మధ్య ప్రధాన పోటీ నెలకొంది. కాంగ్రెస్ కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలని యత్నిస్తుంది. గత ఎన్నికల్లో ఇక్కడ కాంగ్రెస్ ప్రధాన పోటీ దారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన కౌశిక్ రెడ్డి 30 వేల ఓట్ల తేడాతో ఈటల రాజేందర్ చేతిలో ఓటమి పాలయ్యారు.మరోసారి కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగి విజయం సాధిస్తానని చెబుతున్నారు. అయితే ఈటల రాజేందర్ బీజేపీలో చేరడంతో బీజేపీయే ఇక్కడ ప్రధాన పోటీదారుగా నిలిచింది. అధికార పార్టీ అభ్యర్థి ఇంకా ఖరారు కాకపోయినప్పటికీ ఈటలకు దీటైన అభ్యర్థిని టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అన్ని పార్టీలూ హుజూరాబాద్ లో ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించాయిఇక ఆంధ్రప్రదేశ్ లోని బద్వేలు నియోజకవర్గంలో సిట్టింగ్ వైసీపీ ఎమ్మెల్యే వెంకటసుబ్బయ్య మృతితో ఉప ఎన్నిక అనివార్యమయింది. ఈ ఎన్నికలో వెంకటసుబ్బయ్య సతీమణిని వైసీపీ అభ్యర్థిగా ఇప్పటికే జగన్ ప్రకటించారు. టీడీపీ పోటీకి దింపాలా? లేదా? అన్న డైలామాలో ఉంది. బీజేపీ మాత్రం తమ అభ్యర్థి బరిలో ఉంటానని ప్రకటించింది. దీంతో బద్వేలు లో ఉప ఎన్నిక వైసీపీకే అడ్వాంటేజీ అని ఎన్నికలకు ముందే అర్థం అవుతుంది. మొత్తం మీద రెండు తెలుగు రాష్ట్రాల్లో సెప్టెంబరు లో ఉప ఎన్నికల హడావిడి ఉంటుంది.


# పెంచిన పెట్రోల్ ,డీజిల్ ధరలను తగ్గించాలి

డోన్ జూలై 7, ( విభారె) డీజల్, పెట్రోల్ ల ధరలు వెంటనే తాగించాలి అని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది, స్థానికఅఖిల భారత కాంగ్రెస్ పార్టీ, మరియు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజ నాథ్ గారు ఆదేశాల మేరకు, నంద్యాల పార్లమెంట్ డిసిసి అధ్యక్షులు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ పిలుపుమేరకు ,ఈ నెల 7 వ తేదీ నుంచి 17 వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం తీసుకొనే ప్రజా వ్యతి రేఖ విదానాల పై కాంగ్రెస్ పార్టీ పోరు బాట పట్టడం జరిగింది, దేశములో పెరిగిపోతున్న పెట్రోల్ డీజిల్ ధరల కు మరియు నిత్యావసర ధరల పెరుగుదలకు,వంటగ్యాస్ ధరలకు, నిరసనగా స్థానిక కాంగ్రెస్ పార్టీనంద్యాల పార్లమెంట్ డిసిసి ప్రధాన కార్యదర్శి జి.మద్దులేటి ,కార్యదర్శి యు.జనార్దన్ ల ఆధ్వర్యములో డోన్ పట్టణం లోని ఉన్న పెట్రోల్ బంక్ ల దగ్గర సంతకాల సేకరణ చేపట్టడం జరిగింది,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ2014లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక బ్యారెల్ క్రూడ్ ఆయిల్ రేటు 107 దాలర్లు ఉండగా లీటర్ పెట్రోలు 67 రూపాయలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అని ఈనాడు బిజెపి ప్రభుత్వంలో బ్యారెల్ క్రూడ్ ఆయిల్ 37 డాలర్లు ఉండగా దాదాపుగా 107 రూపాయలు లీటర్ పెట్రోల్ ధరలు పెంచడం చాలా దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు, కావున యావత్ భారతదేశం కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలని రాహుల్ గాంధీ గారి నేతృత్వం ఈ దేశంలో ఉండాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని,బడుగు బలహీన వర్గాలు సుఖశాంతులతో ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ మళ్ళీ అధికారంలోకి రావాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.. సంవత్సరన్నర కాలంగా కరోనా వైరస్ విలయ తాండవం చేస్తూ ఉంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం సంవత్సరంలో ప్రతి నెల పెట్రోల్ డీజిల్ పై ధరలు పెంచి ప్రజల నెత్తిన గుదిబండ పడేస్తోంది. పెట్రోల్ డీజిల్ పెంచడం వల్ల దాని ప్రభావం రవాణా రంగంపై పడి దానివల్ల ఆ ప్రభావం నిత్యవసర ధరల పై కూడా పడుతుంది, దీనివల తినడానికి తిండి లేని పేద మధ్యతరగతి కుటుంబాలు చాలా ఇబ్బంది పడుతున్నాయి వ్యాధుల నుండి రక్షించండి మహాప్రభు అని వేడుకుంటే పుండుపై కారం చల్లినట్టు అన్ని నిత్యావసర ధరలు పెంచడం, ఇంటి పన్ను, పెంచి,నూతనంగా చెత్త పన్ను వేసి ప్రజల జీవితాలతో ఆడుకుంటుందని వారు విమర్శించారు,ఈ కార్యక్రమములో ప్యాపిలి మండల, అధ్యక్షులు ఎమ్ ఎన్ సుబ్బు యాదవ్ , నాయకులు ఎమ్ వెంకటస్వామి, డోన్ మండల అధ్యక్షులు వడ్డే రాజశేఖర్, రామభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న నవరత్నాలు ఒక యజ్ఞంలా పేదలకు అందిస్తున్నారు ? ఉప ముఖ్యమంత్రి

తిరుపతి, జూలై 07 జగనన్న తండ్రి వై.ఎస్.రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రి కాగానే నాడు రైతుల అవస్థలు చూసి రైతు రుణమాఫీ, ఉచిత కరెంటు ఇస్తే కొడుకుగా నేడు జగనన్న రెండడుగులు ముందుకు వేసి నవరత్నాలు ఒక యజ్ఞంలా కులాలకు, మతాలకు, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నారని పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి అన్నారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, శ్రీనివాస ఆడిటోరియంలో బుధవారం ఉదయం జిల్లా వ్యవసాయ సలహా మండలి, నవరత్నాలు-పేదలందరికి ఇళ్ళు కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించగా ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మైనింగ్ శాఖల మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, గృహనిర్మాణ శాఖామంత్రి రంగనాథరాజు, జిల్లా కలెక్టర్ హరినారాయణన్ , గృహనిర్మాణ శాఖ ఎం. డి. నారాయణ భరత్ గుప్తా, తిరుపతి నగరపాలక కమిషనర్ గిరీషా, జాయింట్ కలెక్టర్ లు వెంకటేశ్వర, వీరబ్రహ్మం, రాజశేఖర్, పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి, రెడ్డెప్ప శాసనసభ్యులు మధుసూధరెడ్డి ,కరుణాకరరెడ్డి, ఆదిమూలం, శ్రీనివాసులు, నవాజ్ బాషా,మదనపల్లె సబ్ కలెక్టర్ జాహ్నవి, ఆర్ డి ఓ లు చిత్తూరు రేణుక, తిరుపతి కనక నరసారెడ్డి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, జిల్లాఅధికారులు పాల్గొన్నారు. ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ భగవంతుని ఆశీస్సులతో యుగపురుషుడు రాజశేఖర రెడ్డి తనయుడు జగనన్న ముఖ్యమంత్రిగా , గృహనిర్మాణ శాఖ మంత్రిగా రంగనాథ రాజు , పంచాయితీ రాజ్ శాఖమంత్రిగా పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి చిత్తశుద్ధితో పేదల పక్షాన పనిచేస్తున్నారని అన్నారు. జగనన్న ఇప్పుడు ఇస్తున్నదిజగనన్న లేఔట్లు కాదని, జగనన్న పట్టణాలుగా రూపుదిద్దు కోబోతున్నాయని అన్నారు. నేను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ళు 10,600 పాడైతే అప్పటి ముఖ్యమంత్రి దృష్టికి వెళితే చలనం లేదని ఇప్పుడా పరిస్తితి లేదు జగనన్నకాలనీలు అన్నీ సౌకర్యాలతో పట్టణాలుగా రూపుదిద్దుకోబోతున్నాయని అన్నారు. ప్రతి ఇంటికి కొబ్బరిచెట్లు అందించి కేరళ తరహా వాతావరణం తీసుకురానున్నామని అన్నారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీరంగనాథ రాజు మాట్లాడుతూ జగనన్న సుధీర్గ పాద యాత్రలో అక్కచెల్లెమ్మలు కాలువుల, చెరువుల గట్టున వుండటం చూసి ఇచ్చిన మాటమేరకు 35 వేల ఎకరాల భూసేకరణ చేసి 31 లక్షల ఇళ్ళు మంజూరు చేయగా , మొదటి విడతలో 17.60 లక్షల ఇళ్ళు రాష్ట్ర వ్యాప్తంగా మంజూరుచేశారు, రాష్ట్రంలో 17,005 కొత్త గ్రామాలుగా జగనన్న కాలనీలు రానున్నాయి అన్నారు. జిల్లాలో ముఖ్యమంత్రి స్వయంగా శ్రీకాళహస్తి వద్ద 17 వేల మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. చిత్తూరు జిల్లా యంత్రాగం కృషితో జిల్లాలో ఇళ్ల నిర్మాణాల పునాధుల్లో రెండవ స్థానంలో వుందని అన్నారు. ముఖ్యమంత్రి సంక్షేమం విషయంలో పేదలు కంప్యూటర్ బటన్ నొక్కి ఒక లక్ష కోట్లు వారి బ్యాంకు ఖాతాలకు చేర్చారు అన్నారు. ఇక ఇళ్ల విషయంలో పేదవాడికి స్థిరాస్తిగా , డాక్యుమెంట్ రూపంలో ఇవ్వాలని అనుకున్నారు, ఒక్కొక్క చోట దీని విలువ రూ 17 లక్షల వరకు వుందని అన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ వుంది, సిమెంట్ , ఇసుక అందుబాటులో వుంది, నిర్మాణాలకు నీటిని అందిస్తున్నాము తెలిపారు. ముఖ్యమంత్రి ఒకటే అన్నారు, మంజూరు అయిన ఇళ్ళలో ఒక్కటి కూడా కట్ట కుండా ఆగరాదని ఆదేశించారని అన్నారు. ఈ ఇళ్ల నిర్మాణాలతో 4 లక్షల కోట్ల సంపద వస్తుంది, ఉపాది దొరుకుంది, రాష్ట్రం ఆర్థికంగా బలపడుతుందని అన్నారు. ఇల్లుకట్టుకునే వాళ్ళకు రూ. 1,80,000 మంజూరు చేస్తే సబ్సిడీతో అందించే సిమెంట్, ఇసుక, కమ్మిల లో మరో రూ. 70 వేలవరకు లబ్ది కలగనున్నదని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు జగనన్న కాలనీలకు సహకారం అందించి పూర్తిచేయాలని కోరారు.

# కరోనా వచ్చి తగ్గాక కనిపించే పరిణామాలు



నిరుటి తొలి అల నుంచి నేటి మలి అల వరకు కరోనా వైరస్ ఎందరినో కాటేసింది. కరోనా ఇన్ఫెక్షన్ ఉన్న సమయంలో బాధితులు జ్వరం, తలనొప్పి, ఊపిరి అందకపోవడం, ఆయాసం, వాసనలూ, రుచులూ తెలియకపోవడం ఇలాంటి తాత్కాలిక ఇబ్బందులు ఎన్నింటినో ఎదుర్కొన్నారు. సాధారణంగా ఏదైనా జబ్బు తగ్గాక క్రమంగా కోలుకోవాలి. కానీ కరోనా బారిన పడ్డవారు మాత్రం కొన్ని అనంతర అనర్థాలకు లోనవుతున్నారు. దాదాపు అన్ని అవయవాలపైనా, అంతర్గత వ్యవస్థలపైనా... కొన్నింటిపై ప్రత్యక్షంగా, మరికొన్నింటిపై పరోక్షంగా కరోనా తన దుష్ప్రభావాలు చూపుతోంది. తల మొదలుకొని కాలి వేలి వరకు కరోనా వచ్చి తగ్గాక కనిపించే కొన్ని అనంతర పరిణామాలు ఎలా ఉన్నాయో తెలుసుకోడానికి ఉపయోగపడే కథనం ఇది.

ఛాతీ: ఊపిరితిత్తులు / గుండె లాంటి కీలకమైన అవయవాలు అన్నిటికంటే ముఖ్యంగానూ వ్యాధి సమయంలోనూ, ఆ తర్వాత చాలాకాలం పాటు కూడా కరోనాతో ప్రభావితమవుతున్న సంగతి తెలిసిందే. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ కారణంగా నిమోనియా రావడం, కరోనా అనంతరం కూడా చిన్న చిన్న పనులకే ఆయాసం రావడం, ఊపిరి పూర్తిగా అందకపోవడం వంటివి చాలాకాలంపాటు చాలామందిలో కనిపిస్తున్న లక్షణాలు. దీనికి తోడు ఏసీఈ-2 రిసెప్టార్స్ కారణంగా కరోనాకు గుండె వంటి కీలక అవయవాలే ఎక్కువగా గురవుతున్న సంగతీ తెలిసిందే.

ముక్కు - నోరు - గొంతు: కరోనాను నిర్ధారణ చేసేలా అత్యంత ముఖ్యమైన లక్షణాలుగా ముక్కుకు వాసన తెలియకపోవడం, నోటికి రుచి తెలియకపోవడం వంటివి తాత్కాలికంగా జరుగుతాయని మనకు తెలిసిందే. అదృష్టవశాత్తు అవి ఇన్ఫెక్షన్ సోకిన సమయంలో కనిపించే తాత్కాలిక లక్షణాలు కాగా... గొంతు విషయానికి వస్తే కొందరిలో కోవిడ్ అనంతర పరిణామంగా 'డిస్ఫేజియా' అని పిలిచే మింగడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి.

జీర్ణవ్యవస్థ : అన్ని వ్యవస్థల్లాగే జీర్ణవ్యవస్థలోని కాలేయం, పేగులు కూడా కరోనా ప్రభావానికి గురవుతున్నాయి. చాలామందిలో కాలేయం పనితీరు దెబ్బతింటోంది. నిజానికి కాలేయం పనితీరు బాగుంటే... కాలేయ సంబంధిత ఎంజైములైన ఎస్జీపీటీ, ఎస్జీఓటీ వంటి ఎంజైములు రక్తంలో కనిపించవు. కానీ కరోనా అనంతర పరిణామంగా కొంతమందిలో ఇవి కనిపిస్తున్నాయి. అంటే... కాలేయం పనితీరు దెబ్బతిన్నదని చెప్పడానికి ఎస్జీపటీ, ఎస్జీఓటీలు రక్తంలో పెరగడం ఓ సూచన అన్నమాట. దీనికి తోడు జీర్ణవ్యవస్థలోని పేగులు సైతం కరోనాకు ప్రభావితమవుతున్నాయి. అందుకే కొందరిలో డయేరియా, నీళ్లవిరేచనాలు కూడా ఓ లక్షణంగా కనిపిస్తున్నాయి. సాధారణంగా ఇవన్నీ తాత్కాలికమైన అనర్థాలే అని ఇప్పటికి నిపుణులు చెబుతున్నారు. అయితే ఈ విషయంలో ఇంకా పరిశోధనలు జరుగుతున్నాయి.

చర్మం: ఒకింత అరుదుగానే అయినప్పటికీ అక్కడక్కడా కొందరిలో దేహం మొత్తాన్ని కప్పి ఉంచే చర్మంపైనా లేదా చేతుల్లోని చర్మంపైనా తిమ్మిర్లు, గుచ్చినట్లుగా అనిపించడం, పూర్తిగా చల్లగా ఉన్నట్లు అనిపించడం, దాంతో స్పర్శ తెలియకపోవడం లేదా కొందరిలో చర్మం మండుతున్నట్లు అనిపించడం, మొద్దుబారిపోవడం (పారాస్థీషియా) వంటి లక్షణాలు కోవిడ్ అనంతర పరిణామాలుగా కనిపిస్తుండటాన్ని వైద్యనిపుణులు, అధ్యయనవేత్తలు గుర్తించారు.కాళ్లూ, పాదాలు: చాలామందిలో కాళ్లలోని కండాలు పట్టేయడం, కండరాల నొప్పులు అన్న లక్షణాలు కరోనా అనంతర పరిణామంగా ఒకింత ఎక్కువగానే కనిపిస్తున్నాయి. కొంతమందిలో మిల్లర్ ఫిషర్ సింద్రోమ్‌లో కనిపించినట్లే కండరాలపైనా, అలాగే కొన్ని టెండన్స్‌పైనా నియంత్రణ కోల్పోవడం వల్ల కాళ్లూ, చేతులు వంటి అవయవాలను కదిలించే ప్రయత్నంలో పాక్షికంగా మాత్రమే ఆ అవయవాలపై అదుపు సాధించే అటాక్సియా వంటి లక్షణాలూ కనిపిస్తున్నాయి. ఇక పాదాల విషయానికి వస్తే... కరోనా అనంతర పరిణామంగా పాదం పైకెత్తలేకపోవడం (ఫుట్ డ్రాప్) వంటి సమస్యలూ కొందరిలో కనిపిస్తున్నాయి.కళ్లు : కళ్లు ముఖ్యంగా ప్రభావితమయ్యేది 'బ్లాక్ ఫంగస్' ఇన్ఫెక్షన్‌తో అన్న విషయం తెలిసిందే. ఈ కారణంగా కొందరు తమ కంటి చూపునూ కోల్పోవాల్సి వస్తోంది. కొందరిలో మెదడు కొన్ని కండరాలపై నియంత్రణ కోల్పోయినట్లే... 'మిల్లర్ ఫిషర్ సింద్రోమ్' కారణంగా కంటి కండరాల మీద కూడా నియంత్రణ కోల్పోయే పరిస్థితి కూడా ఎదురవుతోంది. దాంతో చూపు మందగించడం, కన్ను, కంటి గుడ్డు కదిలించలేకపోవడం వంటి దుష్ప్రభావాలు కొందరిలో అరుదుగా కనపిస్తున్నాయి.

## యూరో సెమీఫైనల్ మ్యాచ్ చూసిన బుమ్రా దంపతులు

లండన్: ఇండియన్ టీమ్ పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తన భార్య సంజనా గణేషన్‌తో కలిసి లండన్‌లో హాయిగా విహరిస్తున్నాడు. డబ్ల్యూటీసీ ఫైనల్ తర్వాత ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు ఖాళీ సమయం దొరకడంతో యూకేలో ఎంజాయ్ చేస్తున్నాడు. తాజాగా భార్య సంజనతో కలిసి ఇటలీ, స్పెయిన్ మధ్య జరిగిన యూరో సెమీఫైనల్ మ్యాచ్ చూశాడు. లండన్‌లోని వింబ్లే స్టేడియంలో ఈ మ్యాచ్ జరిగింది. స్టేడియంలో ఉన్న ఫొటోను సంజనా షేర్ చేసింది. ఈ మ్యాచ్‌లో గెలిచిన ఇటలీ.

# 'అంటే .. సుందరానికీ' ఏమైంది?




మొదటి నుంచి కూడా నాని తన సినిమాల విషయంలో పక్కా ప్లానింగుతో ఉంటాడు. ఏడాదికి మూడు సినిమాలు తన నుంచి థియేటర్లకు వెళ్లేలా ఆయన ప్లాన్ చేసుకుంటాడు. అయితే కరోనా కారణంగా ఈ ఏడాదిలో తన సినిమాను అనుకున్న సమయానికి ఆయన థియేటర్లకు తీసుకురాలేకపోయాడు .. అదీ థియేటర్లు మూసి ఉండటం వలన. అంతే తప్ప ఆయన తప్పు ముమ్మాటికీ లేదు. ఈ ఏడాది ఆయన చేస్తున్న మూడు సినిమాల్లో మొదటిదైన 'టక్ జగదీశ్' ఉత్సాహంతో విడుదలకి సిద్ధమైంది. కానీ అప్పటికే కరోనా విజృంభణ మొదలైపోవటంతో వాయిదా పడింది.శివ నిర్వాణ దర్శకత్వం వహించిన 'టక్ జగదీశ్' .. టైటిల్ తోనే అందరిలో ఆసక్తిని రేకెత్తించింది. గ్రామీణ నేపథ్యంలో ఈ కథ నడుస్తుంది. కుటుంబాలు .. బంధాలు .. అనుబంధాల చుట్టూ తిరుగుతుంది. జగపతిబాబు కీలకమైన పాత్రను పోషిస్తూ ఉండటంతో సహజంగానే ఈ సినిమాపై అందరిలో అంచనాలు పెరుగుతూ వెళ్లాయి. థియేటర్లు తెరుచుకున్న తరువాత సందడి చేయడానికి లైన్లో ఉన్న సినిమాల జాబితాలో 'టక్ జగదీశ్' కూడా ఉన్నాడు. ఆ తరువాత సినిమాగా నాని 'శ్యామ్ సింగ రాయ్' చేస్తున్నాడు. విభిన్నమైన కథాకథనాలతో ఈ సినిమా రూపొందుతోంది.రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్న 'శ్యామ్ సింగ రాయ్'లో నాని లుక్ డిఫరెంట్ గా ఉంది. అంతేకాదు కథా నేపథ్యం కూడా వైవిధ్యంగా ఉండటంతో అంచనాలు బాగానే ఉన్నాయి. ఈ సినిమాలో నాని సరసన నాయికలుగా సాయిపల్లవి .. కృతి శెట్టి .. మడోన్నా సెబాస్టియన్ కనిపించనున్నారు. ఈ ముగ్గురు కథానాయికలతో నాని రొమాన్స్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు తరువాత నాని నుంచి రానున్న మరో సినిమానే 'అంటే .. సుందరానికీ'.ఈ సినిమాకి వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్నాడు. 'బ్రోచేవారెవరురా' వంటి నాన్ స్టాప్ ఎంటర్టైనర్ తో ప్రేక్షకులను అలరించిన దర్శకుడు కావడంతో ఈ సినిమా మంచి బజ్ ఉంది. పైగా టైటిల్ తోనే కొత్తదనాన్ని చూపించడంలో వివేక్ ఆత్రేయ సక్సెస్ అయ్యాడు. ఈ సినిమాలో నాని సరసన నాయికగా తెలుగు తెరకి 'నజ్రియా' పరిచయమవుతోంది. ఆ మధ్య ఈ సినిమా షూటింగు మొదలైందని అన్నారు. షూటింగు నిమిత్తం నజ్రియా వచ్చిందనీ కరోనా తీవ్రత పెరగడం వలన వెనక్కి వెళిపోయిందనే వార్తలు వచ్చాయి. ఆ తరువాత నుంచి అప్ డేట్స్ లేవు. సుందరానికి ఏమైందో ఏమిటో తెలుసుకోవాలనే కుతూహలం అభిమానుల్లో పెరుగుతోంది. మరి మేకర్స్ నుంచి అప్ డేట్ ఏదైనా వస్తుందేమో చూడాలి.

# ఆ సినిమా నాకు అన్నిటికన్నా స్పెషల్!

సినిమా ఫ్లాప్ కావడం అంటే ఏంటీ? ఒక ఐడియా చాలా మందికి నచ్చకపోడం. హిట్ కొట్టడం అంటే.. ఎక్కువ మందికి నచ్చడం. దట్సాల్. మిగతా దంతా సేమ్ టూ సేమ్. ఒక హిట్ సినిమాను ఎలా తెరకెక్కిస్తారో.. ఫ్లాప్ సినిమా సైతం అదే విధంగా రూపొందుతుంది. అవి రిలీజ్ అయిన తర్వాతగానీ.. ఎంత మందికి నచ్చిందనే విషయం ఆధారంగా.. హిట్టు ఫ్లాపు అని డిసైడ్ చేస్తారు. కానీ.. ఆ సినిమాను తీసిన దర్శకుడికి మాత్రం ప్రతిసినిమా ఒక్కటే.ఆ విధంగా చూసుకున్నప్పుడు తనకు ఆరెంజ్ సినిమా ఎంతో స్పెషల్ అంటున్నాడు బొమ్మరిల్లు భాస్కర్. 'బొమ్మరిల్లు' సినిమాతో ఇండస్ట్రీ చూపు తనవైపు తిప్పుకున్నాడు భాస్కర్.

ఆ తర్వాత పరుగు కూడా పర్వాలేదనిపించింది. ఆ తర్వాత రామ్ చరణ్ తో తెరకెక్కించిన చిత్రం ఆరెంజ్. జీవితంలోని వాస్తవాలను ముసుగు తీసి మరీ చూపించిన ఈ సినిమా చాలా మందికి నచ్చలేదు. ఎందుకంటే.. అబద్ధమే హాయిగా ఉంటుంది కదా! అందుకే.. వాస్తవం చూపించిన ఈ సినిమా కమర్షియల్ గా హిట్ జాబితాలో చేరలేదు. కానీ.. నిజాలను అంగీకరించే వర్గానికి మాత్రం ఈ సినిమా ఎంతగానో నచ్చింది.ఇదే విషయాన్ని లేటెస్ట్ ఇంటర్వ్యూలో చెప్పాడు దర్శకుడు భాస్కర్. అంతేకాదు.. తనను ఆరెంజ్ వంటి సినిమా తీయాలని కూడా కోరుతారట. వాళ్లు కోరడమే కాదు.. తనకు కూడా ఆరెంజ్ సినిమా ఎంతో స్పెషల్ అని చెప్పాడు బొమ్మరిల్లు భాస్కర్. తన కెరియర్లోనే అత్యంత కష్టపడి ఎంతో ఇష్టపడి తీసిన సినిమా కూడా ఇదేనని చెప్పారు.రాత్రి పగలు తేడా లేకుండా స్క్రిప్టు కోసం శ్రమించినట్టు చెప్పాడు. అయితే.. స్క్రీన్ ప్లే దారితప్పడం వల్ల తేడా వచ్చిందని అన్నాడు. అయినప్పటికీ.. ఆ చిత్రానికి తన మనసులో ప్రత్యేక స్థానం ఉందని చెప్పాడు దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్. కాగా.. చాలా గ్యాప్ తర్వాత అక్కినేని అఖిల్ తో 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' సినిమా తెరకెక్కించాడు. త్వరలోనే ఈ చిత్రం రిలీజ్ కానుంది. మరి అతని కెరీర్ కు ఎంతో కీలకమైన ఈ సినిమా ఎలాంటి ఫలితం సాధిస్తుందో చూడాలి.

## 'డిక్టేటర్' కాంబో రిపీట్ కాబోతోందా..?

నటసింహం నందమూరి బాలకృష్ణ 60ఏళ్లకు పైబడిన వయసులో కూడా ఫుల్ ఎనర్జీతో వరుస సినిమాలు చేస్తూ దూకుడు చూపిస్తున్నారు. ప్రస్తుతం బోయపాటి శ్రీను దర్శకత్వంలో హ్యాట్రిక్ మూవీగా 'అఖండ' అనే యాక్షన్ ఎంటర్టైనర్ చేస్తున్నారు. ద్వారాక క్రియేషన్స్ బ్యానర్ పై మిర్యాల రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ మూవీ సెట్స్ పై ఉండగానే 'క్రాక్' డైరెక్టర్ గోపీచంద్ మలినేని తో ఓ మూవీ అనౌన్స్ చేసాడు బాలయ్య. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ ఎర్నేని - వై.రవి శంకర్ కలసి ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. వాస్తవ సంఘటన ఆధారంగా ఓ పవర్ ఫుల్ స్టోరీతో ఈ సినిమా రూపొందనుంది. ఇదే క్రమంలో అనిల్ రావిపూడి డైరెక్షన్ లో బాలకృష్ణ ఓ సినిమా చేసే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే అనిల్ చెప్పిన స్టోరీ లైన్ కు నటసింహం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే రాబోయే రోజుల్లో శ్రీవాస్ దర్శకత్వంలో బాలయ్య ఓ సినిమా చేయనున్నాడని తాజాగా ఓ న్యూస్ ఫిలిం సర్కిల్స్ లో చక్కర్లు కొడుతోంది.'లక్ష్యం' 'లౌక్యం' వంటి సూపర్ హిట్స్ అందుకున్న డైరెక్టర్ శ్రీవాస్.. బాలకృష్ణతో "డిక్టేటర్" అనే సినిమా రూపొందించాడు. 2016 సంక్రాంతి సీజన్ లో వచ్చిన ఈ యాక్షన్ ఎంటర్టైనర్ ఓ మోస్తరు విజయాన్ని సాధించింది. ఈ క్రమంలో ఇప్పుడు బాలయ్య కోసం శ్రీవాస్ మరో స్టోరీ రెడీ చేస్తున్నారని తెలుస్తోంది. కార్పోరేట్ రాజకీయాల నేపథ్యంలో సందేశాత్మక అంశాలతో ఈ కథని సిద్ధం చేస్తున్నారట. ఇప్పటి వరకు మాస్ పాత్రల్లో మెప్పించిన నటసింహాన్ని ఇందులో శ్రీవాస్ కొత్త అవతారంలో చూపించబోతున్నారట. కిందిస్థాయి నుంచి వచ్చిన వ్యక్తి స్వయంకృషితో ఓ కంపెనీ సీఈఓ గా ఎలా ఎదిగాడు.. కార్పొరేట్ రాజకీయాల్లో ఎలాంటి పాత్ర పోషించారు అనే అంశాలని ఈ కథలో ప్రస్తావిస్తున్నారట. సీకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై సి. కళ్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించే అవకాశం ఉందని అంటున్నారు. సి.కళ్యాణ్ గతంలో బాలయ్యతో 'జై సింహా' 'రూలర్' వంటి చిత్రాలను రూపొందించారు. అంతా బాగానే ఉంది కానీ ఇన్నాళ్లూ మాస్ రోల్స్ లో అలరించిన బాలకృష్ణ.. సూటూ బూటూ వేసుకొనే పాత్రలో నటిస్తే ఆడియన్స్ ఎలా తీసుకుంటారనేది ఆసక్తికరమే. ఇంతకముందు వచ్చిన 'రూలర్' సినిమాలో కూడా బాలయ్య ఓ కంపెనీ సీఈఓ గా నటిస్తే ప్రేక్షకులు తిరస్కరించారు. మరి ఇప్పుడు శ్రీవాస్ సినిమా చేసేది నిజమే అయితే ఎలాంటి రిజల్ట్ అందుకుంటాడో చూడాలి.



# చివరికి రత్తాలు ప్రయత్నాలు అలా ఫెయిల్

రాయ్ లక్ష్మి కెరీర్ చివరి దశకు చేరుకున్నా యూత్ లో ఫోకస్ మాత్రం తగ్గడంలేదు. దానికి కారణంగా ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ద్వారా హాట్ హాట్ ఫోటోషూట్లతో హీటెక్కించడమే. బికినీ..టూపీసుల్లో ఎప్పటికప్పుడు హీటెక్కిస్తూ అటెన్షన్ డ్రా చేయడం రాయ్ లక్ష్మి స్పెషాల్టీ. ఈ తరహా అటెంప్ట్ లు అప్పుడప్పుడు అవకాశాలు తెచ్చిపెట్టాయనడంలో సందేహం లేదు. రత్తాలు స్పీడ్ చూడడం వల్లనే ఇటీవల పలువురు నవతరం దర్శకనిర్మాతలు ఆమెను ఎంకరేజ్ చేసారు. కానీ ఎన్నిచోట్ల నటించినా తెలుగులో మాత్రం ఆఫర్ లేదు. ఇక్కడ సినిమా చేసి మూడేళ్లు అవుతోంది.ఇప్పటికీ టాలీవుడ్ దర్శకనిర్మాతలకు ఫీలర్స్ వదులుతూ టచ్ లోనే ఉంది. ప్రస్తుతం రాయ్ లక్ష్మి తెలుగులో 'ఆనంద భైరవి' అనే సినిమాలో నటిస్తోంది. ఈ చిత్రాన్ని వాస్తవ కథ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. దేశంలో జరిగిన ఓ అత్యాచార ఘటన ఆధారంగా చిత్రం తెరకెక్కిస్తున్నారు. బాధితురాలి పాత్రలో రాయ్ లక్ష్మి నటిస్తుంది. ఇందులో మరో కీలక పాత్రలో అంజలి నటిస్తోంది. ప్రస్తుతానికి రాయ్ లక్ష్మి చేతిలో ఉన్న ఒకే ఒక్క తెలుగు సినిమా ఇదే. ఆశలన్నీ ఈ సినిమాపైనే. టాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ అవ్వాలని ఎంట్రీ ఇచ్చినా టైమ్ కలిసి రాలేదు.నిజానికి ఇప్పటివరకూ కథానాయికగా కొనసాగడం అదృష్టం అనుకుంటే ఇటీవల ఐటెమ్ నంబర్లతో స్పాన్ ని పెంచుకుంది ఈ బ్యూటీ. అప్పట్లో ఖైదీనంబర్ 150 చిత్రంలో ఓసోసి రత్తాలు తనకు మైలేజ్ ని పెంచింది.కెరీర్ ఆద్యంతం మీడియం రేంజు హీరోలతోనే నటించిన ఈ బ్యూటీకి స్టార్ హీరోల చిత్రాల్లో నటించే ఛాన్స్ లు చాలా అరుదుగానే వచ్చాయి. పెద్ద హీరోల చిత్రాల్లో స్పెషల్ అప్పీరియన్స్.. ఐటం పాటల్లో మాత్రమే కనిపించింది. చెప్పుకోదగ్గ స్ట్రెయిట్ తెలుగు చిత్రాలేవి చేయలేదు. అయితే కోలీవుడ్ లో మాత్రం బిజీగానే ఉంది. ప్రస్తుతం అక్కడ మూడు సినిమాల్లో నటిస్తోంది. బాలీవుడ్ లో మూడు నాలుగు సినిమాలు చేసింది. కానీ అక్కడ రాణించలేకపోయింది. చివరికి కోలీవుడ్ లోనే స్థిరపడి కెరీర్ బండిని లాగించేస్తోంది. తాజాగా రాయ్ లక్ష్మి పసుపు పచ్చ బికినీలో అగ్గి రాజేస్తున్న ఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190